

ప్రైమరీ బోధనకు బిఇడిలు అర్హులు కాదు

- సుప్రీంకోర్టు

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 16 | విజయవాడ, బుధవారం 16 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 16 August 2023 | Rs



ఢిల్లీలోని ఎర్ర కోటలో జాతీయ పతాకావిష్కరణ అనంతరం ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

పాత పాటే...

- ప్రతిపక్షాలపై విమర్శలకు ఎర్ర కోట వేదిక
- అవినీతి, బంధుప్రీతికి వ్యతిరేకంగా పోరాటం
- 90 నిమిషాల సుదీర్ఘ ప్రసంగంలో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపులకు వ్యతిరేకంగా పోరాడతానంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాత పాటే పాడారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా ఎర్రకోట వద్ద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 90 నిమిషాలసేపు సాగిన ఆయన ప్రసంగం ఆసాంతం ఎన్నికల ప్రసంగాన్ని తలపించింది. వచ్చే ఆగస్టు 15 నాటికి మళ్లీ తామే వస్తామని ఆయన జోస్యం చెప్పారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి "పారదర్శకత, నిష్పాక్షికత"ను బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. అవినీతి, బంధుప్రీతి (పరివార్వాద్), బుజ్జగింపులు దేశాన్ని వెనుకకు లాగుతున్న "వ్యాధులు" గా ఆయన అభివర్ణించారు. రానున్న ఐదేళ్లలో ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా భారత దేశం నిలుస్తుందని అన్నారు. 13.5 కోట్ల మంది భారతీయులను

మిగతా 5లో



పేదల కోసం యుద్ధం

- 2025 జూన్ నాటికి పోలవరం పూర్తి
- మూడు ప్రాంతాలకు హక్కుగా రాజధానులు
- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెత్తందారీ పోకడలపై పేదలు గెలిచి వారి జీవితాలు బాగుపడేవరకు తమ యుద్ధం కొనసాగుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, పదాతిదళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు దాటినా సమాజంలో అంటరానితనం రూపం మార్చుకుని పెత్తందారీ భావజాలంతో కొనసాగుతోందని చెప్పారు. పేదలు చదివే స్కూళ్లను పాడుబడేలా చేయడం, పేదలు ఇంగ్లీష్ మీడియం చదువుకోవద్దని వాదించడం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత సేవలు అందకుండా చేయడం, పేదలకు ఇళ్ల

మిగతా 2లో

సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు

బిందేశ్వర్ పాఠక్ ఇకలేరు



న్యూఢిల్లీ : సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు, పద్మ భూషణ్ అవార్డు గ్రహీత, సామాజిక కార్యకర్త బిందేశ్వర్ పాఠక్ మంగళవారం గుండెపోటుతో మరణించారు. ఆయన వయసు 80 సంవత్సరాలు. మంగళవారం మధ్యాహ్నం 1.15 గంటలకు బిందేశ్వర్‌ను కుటుంబ సభ్యులు ఎయిమ్స్‌కు తరలించగా, కొద్ది సేపటికే అంటే.. 1.42 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు. బహిరంగ మల విసర్జన, మాన్యువల్ స్కావెంజింగ్‌ను తగ్గించడంలో గణనీయంగా దోహదపడిన విప్లవాత్మక సులభ్ కాంప్లెక్స్ వ్యవస్థను స్థాపించడంతో బిందేశ్వర్ విశేష గుర్తింపు పొందారు. బీహార్‌లో జన్మించిన ఆయన 1970లో సులభ్ ఇంటర్నేషనల్‌ను స్థాపించారు. బిందేశ్వర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బిందేశ్వర్ మంగళవారం ఉదయం వరకూ ఉత్సాహంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు, సన్నిహితులు తెలిపారు. ఉదయం ఢిల్లీలోని సులభ్ కాంప్లెక్స్‌లో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లోనూ బిందేశ్వర్ పాల్గొన్నారు. బిందేశ్వర్ అంత్యక్రియలు బుధవారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. బిందేశ్వర్ మృతిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తదితర ప్రముఖులు సంతాపం తెలిపారు.

తూర్పు లడఖ్ సహా వివాదాల పరిష్కారానికి

భారత్ – చైనా అంగీకారం

5

విజన్ 2047

- విశాఖ ర్యాలీలో టిడిపి అధినేత చంద్రబాబు
- నయా ఉదారవాద విధానాలకు వత్తాసు



టిడిపి శ్రేణులతో ర్యాలీ నిర్వహిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభాలకు కారణమైన నయా ఉదారవాద విధానాలను టిడిపి అధినేత చంద్రబాబు మరోసారి ఆకాశానికెత్తేశారు. మంగళవారం సాయంత్రం విశాఖలో టిడిపి శ్రేణులతో ఆర్‌కె బీచ్‌లోని కాళీమాత టెంపుల్ సమీపాన ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి ఎంజిఎం పార్కు వరకూ ఆయన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన 'ఇండియా-ఇండియన్స్-తెలుగూస్ విజన్-2047 సభలో పాల్గొన్నారు. విజన్-2047 ముసాదాయి పత్రాన్ని విడుదల చేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ దేశంలో అనేక సంస్కరణలను నాటి ప్రధాని పివి.నరసింహారావు తెచ్చారని, ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలను తాను తీసుకొచ్చి రెగ్యులేటరీ కమిషన్‌ను, ఎనిమిది గ్రిడ్‌లను ఏర్పాటు చేశానన్నారు. నేడు ప్రపంచంలోనే భారతీయులు ఆర్థికంగా శక్తివంతంగా ఉన్నారని పేర్కొన్నారు. తెలుగువారంతా ఏకమై 2047 లక్ష్యాల కోసం పనిచేయాలని, ఈ ముసాదాయి పత్రంపై మేధావులు, విశాఖ ప్రజల తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. దేశంలో జరిగిన నోట్ల రద్దు అవినీతి డబ్బు పోగుపడకుండా చేసిందని సమర్థించారు.

ఆరు పాయింట్లుగా విభజించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

విజన్ డాక్యుమెంట్-2047 ముసాయిదాను ఆరు పాయింట్లుగా విభజించి వేదికపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గ్లోబల్ ఎకానమీగా ఇండియా, డెమోగ్రాఫిక్ మేనేజిమెంట్ పి-4 మోడల్ సంక్షేమం, సాంకేతికత, పరిశోధన, ఎనర్జీ సెక్యూర్ ఇండియా, వాటర్ సెక్యూర్ ఇండియా, సోలార్, విండ్ పంప్డ్ ఎనర్జీ వంటి ప్రాజెక్టులతో దేశం ప్రగతి సాధిస్తోందన్నారు. హైదరాబాద్ అభివృద్ధి తనవల్లే జరిగిందని, నేడు అత్యధిక తలసరి ఆదాయం సాధించడానికి తన దూరదృష్టే కారణమని పేర్కొన్నారు. ఒక్క అవకాశం కింద వైసిపికి ఐదేళ్లు అధికారమిచ్చి 20 ఏళ్లు ఎపి వెనక్కి వెళ్లేలా చేసుకున్నామన్నారు. ఈసారి టిడిపిని అధికారంలోకి తేవాలని కోరారు. మేధావులు, చదువుకున్న వారు టిడిపి కోసం 2024లో పనిచేయాలని కోరారు.

విశాఖ ప్రజలూ అమరావతినే రాజధానిగా కోరుకుంటున్నారు : చంద్రబాబు

వైసిపిపైనా, ముఖ్యమంత్రి జగన్‌పైనా చంద్రబాబు విమర్శలు గుప్పించారు. అమరావతిని జగన్ సర్వనాశనం చేశారని అన్నారు. విశాఖ ప్రజలు కూడా అమరావతినే రాజధానిగా కోరుకుంటున్నారని, ఇక్కడ ప్రజల మంచితనం ఇదని పేర్కొన్నారు. ఏ రాష్ట్రానికీలేని నీటి సంపద మన రాష్ట్రంలో ఉన్నా ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయలేకపోతున్నారని విమర్శించారు. పోలవరాన్ని తాను 72 శాతం పూర్తి చేశానని తెలిపారు. ప్రసంగం అనంతరం ఇష్టాగోష్టి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పీలా గోవింద సత్యనారాయణ, ఎం.శ్రీభరత్ పాల్గొన్నారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు గైర్హాజరయ్యారు.



న్యూ ఢిల్లీలోని ఎకెజి భవన్‌లో మువ్వెన్నల పతకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

- వార్త లోపల పేజీలో

దళిత మహిళపై సామూహిక అత్యాచారం

ప్రజాశక్తి-తుగ్గలి (కర్నూలు జిల్లా)

దళిత మహిళపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. పొలం పనులకు వెళ్లిన సమయంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో జరిగిన ఈ సంఘటన బాధితురాలి ఫిర్యాదుతో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎద్దుల దొడ్డి గ్రామానికి చెందిన దళిత మహిళ అదే గ్రామానికి చెందిన ఈడిగ ఉపేంద్ర పొలంలో ఆముదపు పంటను కోసేందుకు ఈ నెల ఐదున వెళ్లారు. పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న సమయంలో కాపు కాచిన ఈడిగ ఉపేంద్ర, రామానాయుడు కలిసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెపై అత్యాచారం చేశారు. ఈ దారుణాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించారు. ఈ ఘటనపై బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుగ్గలి ఎస్‌పి మల్లికార్జున తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : ఎంఆర్‌పిఎస్



దళిత మహిళపై అత్యాచారం చేసిన సంఘటనలో నిందితులైన ఈడిగ ఉపేంద్ర, రామనాయుడును కఠినంగా శిక్షించాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కన్వీనర్ ఉసిరిపాట బ్రహ్మయ్య, జిల్లా కన్వీనర్ రామకొండ వెంకటేశ్వర్లు, కో కన్వీనర్ పులికొండ డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులను ఎంఆర్‌పిఎస్ నాయకులు పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. దళితులపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దాడులు అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించకపోతే ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ ఉద్యోగుల 'చలో విజయవాడ' వాయిదా

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగులు ఈ నెల 17న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు స్ట్రగుల్ కమిటీ చైర్మన్ సుదర్శన్ తెలిపారు. పే రివిజన్, ఇతర సమస్యలకు సంబంధించి ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సంతకాల సేకరణ చేస్తున్నారని, కాంట్రాక్టు, పర్మినెంటు వర్కర్లు ఎక్కడికక్కడ కార్మిక కమిషనర్లకు తమ అభ్యంతరాలు సమర్పిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు మంగళవారం తెలిపారు. అయితే, చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతామని, ఎప్పుడనేది ఒకట్రెండు రోజుల్లో చెబుతామని ఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని దీక్ష

3

ప్రజలపై మోడీ యుద్ధం

కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజలపై యుద్ధం చేస్తోందని సామాజిక కార్యకర్త, జర్నలిస్టు, న్యాయవాది తీస్తా సెతల్వాద్ అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్య స్ఫూర్తి ఇలా అన్ని వ్యవస్థలపైనా బిజెపి ప్రభుత్వం సైద్ధాంతికంగా దాడులకు పాల్పడి ధ్వంసం చేస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రస్తుతం దేశం, ప్రజల మనుగడ ప్రమాదంలో పడిందని తెలిపారు. ఆదివాసీలు, దళితులు, మహిళలపై అత్యాచారాలు, పైశాచిక దాడులు లక్ష్యపూరితంగానే సాగుతున్నాయన్నారు. గుజరాత్ నమూనాను అన్ని రాష్ట్రాలకు, యావత్ దేశానికి విస్తరించేందుకు బిజెపి, సంఘ పరివారం కుట్రలు పన్నుతోందని పేర్కొన్నారు. ప్రజలపై యుద్ధం ప్రకటించిన మోడీ సర్కారు, హిందూత్వ శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. గుంటూరులో జరుగుతున్న ఇండియన్ లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర మహాసభ పురస్కరించుకొని ఆదివారం ఏర్పాటు చేసిన సెమినార్‌లో ముఖ్యవక్తగా పాల్గొనేందుకు వచ్చిన తీస్తా సెతల్వాద్ ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

సైద్ధాంతికంగానే వ్యవస్థల ధ్వంసం

ప్రతిపక్షాలు, పౌర సమాజం ప్రతిఘటించాలి

ప్రజాశక్తి ఇంటర్వ్యూలో తీస్తా సెతల్వాద్

ప్రశ్న: 2002 నాటి గుజరాత్ హత్యాకాండ బాధితుల తరపున పోరాడుతున్న మీపై కల్పిత ఆధారాలు సమర్పించారంటూ పోలీసులు కేసులు పెట్టారు. రాజ్యంతో పాటు న్యాయవ్యవస్థపై కూడా మీరు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. దీనిపై మీరేం చెబుతారు?


జవాబు: ఈ అంశం న్యాయ వ్యవస్థ పరిధిలో ఉంది. దీనిపై నేను మాట్లాడటం సబబు కాదు.

ప్రశ్న: ఈ కాలంలో మతపరంగా మైనార్టీలు, దళితులపై విద్వేషపూరిత దాడుల పెరుగుదలను చూస్తున్నాం. వీటిపై ఏ విధంగా పోరాడాలి?

జవాబు: 2014లో కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చాక రాజకీయంగా, సైద్ధాంతికంగా ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. అన్ని వ్యవస్థలను తన అధీనంలోకి తెచ్చుకుంటోంది. అంతా ఏకపక్షం చేసేస్తోంది. మీడియాను తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకుంటోంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియాను కబ్జా చేసింది. జాతీయ స్థాయిలో చాలా భాగం హిందీ ఛానల్స్ ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తున్నాయి. ఇంగ్లీషు ఛానల్స్ పరిస్థితీ అదే. కన్నడ, తమిళ ఛానల్స్‌లో కొంత వరకు, గుజరాత్‌లో మొత్తం ఛానల్స్ బిజెపి ఎజెండాకనుగుణంగా పని చేస్తున్నాయి. పనిగట్టుకొని ముస్లింలు, క్రైస్తవులకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ఏది చెడ్డ వార్తో ఏది మంచి వార్తో అర్థం కాకుండా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయి. ట్విటర్, వాట్సాప్, ఫేస్‌బుక్‌లలోనూ బిజెపి, పరివారం చొచ్చుకెళ్లి ప్రజల మెదళ్లలో విషం ఎక్కిస్తున్నాయి. ప్రతిపక్షాలు, పౌర సమాజం సమర్థవంతంగా ఎదుర్కోవాలి. సోషల్ మీడియా, మీడియాను నైపుణ్యంతో నిర్వహించాలి. ఇదొక పెద్ద ఛాలెంజ్.

ప్రశ్న: యూనిఫాం సివిల్ కోడ్ (యుసిసి)పై చర్చ జరుగుతోంది, దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?

జవాబు: ప్రజల మధ్య సమానత్వం సాధించాలన్నది రాజ్యాంగం నిర్దేశం. ఎన్నో కులాలు, మతాలు, ప్రాంతాలు కలిగిన వైవిధ్యభరిత దేశం మనది. ఎవరి అస్తిత్వం, సంప్రదాయాలు వారికి ఉన్నాయి. దక్షిణాది, ఉత్తరాది మధ్య వ్యత్యాసాలున్నాయి. ఆదివాసీలకు వారి తెగల సంప్రదాయాలున్నాయి. ఇన్నింటి మధ్య దేశ వ్యాప్తంగా అందరికీ ఒకే పౌర చట్టం ఇప్పుడప్పుడే సాధ్యం కాదు. మెల్లిగా అందరినీ ఒప్పించుకుంటూ చేయాలి. ముందుగా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత విషయాల్లో స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం సాధించాలి. మొన్నటికి మొన్న మోడీ ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ చట్టం తెచ్చింది. ట్రిపుల్ తలాక్‌తో సహా పలు ఛాందస భావాలు, పద్ధతులు మారాలని అభ్యుదయ ముస్లిం మహిళలు, పురుషులు ఎప్పుడో కోరుకున్నారు. మాది స్పెషల్ మేరేజి. ఆ చట్టం కింద రిజిస్ట్రేషన్ జరిగింది. నేను హిందువు, నా భర్త ముస్లిం.



ప్రశ్న: బిల్కిస్‌బానో ఉదంతంపై మీ కామెంట్?

జవాబు: నాటి గుజరాత్ మారణహోమంలో గర్భిణిగా ఉన్న బిల్కిస్‌బానో గ్యాంగ్ రేప్‌కు గురైంది. ఆమె కుటుంబాన్ని హిందూత్వ

మిగతా 3లో

న్యాయవ్యవస్థ చరిత్ర అంటే

జీవన పోరాటాల చరిత్రే

- భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్
- 27 కోర్టులు, 51 జడ్జి చాంబర్లతో సుప్రీం విస్తరణకు ప్రణాళిక



ప్రసంగిస్తున్న జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ : 76 ఏళ్ళలో భారత న్యాయ వ్యవస్థ చరిత్ర అంటే దేశ ప్రజల రోజువారీ జీవన పోరాటాల చరిత్రేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ మంగళవారం వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టు లాన్స్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సుప్రీంకోర్టును విస్తరించేందుకు అదనంగా మరో 27 కోర్టులు, 51 న్యాయమూర్తుల ఛాంబర్లతో తమ వద్ద ప్రణాళిక వున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం సుప్రీం కోర్టుకు 16 కోర్టు రూమ్‌లు, రెండు రిజిస్ట్రార్ కోర్టులు వున్నాయి. న్యాయమూర్తుల సంఖ్య 32గా వుంది. న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాల వ్యవస్థను ప్రక్షాళన చేయడం అవసరమన్నారు. "27 అదనపు కోర్టులు, 51 న్యాయమూర్తుల ఛాంబర్లు, నాలుగు రిజిస్ట్రార్ కోర్టు రూమ్‌లు, 16 రిజిస్ట్రార్ ఛాంబర్లు, న్యాయవాదులు, కక్షిదారులకు అవసరమైన ఇతర సదుపాయాలకు వెసులుబాటు కల్పిస్తూ కొత్త భవనాన్ని నిర్మించడం ద్వారా అత్యున్నత న్యాయస్థానాన్ని విస్తరించాలన్నది మా ప్రణాళికగా వుంది." అని చంద్రచూడ్ తెలిపారు. రాజ్యాంగ పరిమితులకు లోబడే పాలనా వ్యవస్థల కార్యకలాపాలకు' హామీ కల్పించడంలో న్యాయవ్యవస్థ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. తమ హక్కులు, స్వేచ్ఛలకు రక్షణ కల్పించాలని కోరే వ్యక్తులకు సురక్షితమైన ప్రజాస్వామ్య స్థలాన్ని కోర్టులు అందిస్తాయని చెప్పారు. న్యాయాన్ని ఆకాంక్షిస్తూ ప్రజలు రావడానికి తగిన అవకాశాలను కల్పించడంతో పాటూ భారత ప్రజల రాజ్యాంగ ఆశయాలు, నమ్మకాలు, ప్రాధాన్యతలను కొత్త భవనం ప్రతిబింబిస్తుందని చంద్రచూడ్ చెప్పారు. న్యాయావకాశాలను మెరుగుపరచడం, రాజ్యాంగ విలువలను పెంపొందించడం ద్వారా వ్యవస్థాగత పాలనలో సుప్రీం కోర్టు అగ్రగామిగా వుందన్నారు.





స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ఆకట్టుకున్న విద్య, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామ వార్డు సచివాలయ శాఖల శకటాలు తొలి మూడు స్థానాలలో నిలిచి పురస్కారాలు దక్కించుకున్నాయి.
(ఇన్‌సెట్‌లో ముఖ్యమంత్రి నుంచి పురస్కారాలు స్వీకరిస్తున్న ఆయా శాఖల ఉన్నతాధికారులు)

అలరించిన శకటాల ప్రదర్శన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన శకటాలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంగళవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలైన గ్రామ, వార్డు సచివాలయాలు, వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, పాఠశాల విద్య-సమగ్రశిక్ష, వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు, వైద్యారోగ్యశాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ఎపి రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ, సంక్షేమశాఖ, అటవీశాఖ, పరిశ్రమలశాఖ, రెవెన్యూశాఖల్లో జరుగుతున్న కార్యక్రమాలను శకటాలపై రూపొందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని పరిశీలించారు. పరేడ్ అనంతరం విజయవాడ నగర ప్రజలు వీక్షించేలా రూట్ మ్యాప్ నిర్ణయించి శకటాల ప్రదర్శన వాహనాలను సమాచార పౌర సంబంధాలశాఖ కమిషనరు తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ 13 శకటాలు విజయవాడ నగర వీధుల్లోకి వెళ్లగానే ప్రజలు ఆసక్తిగా తిలకించారు. విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ స్టేడియం నుంచి ప్రారంభమైన శకటాల ప్రదర్శన బెంజ్ సర్కిల్, సిద్ధార్థ మెడికల్ కాలేజ్, రామవరప్పాడు రింగ్ రోడ్, గుణదల, ఏలూరు రోడ్డు మీదుగా తిరిగి ఇందిరాగాంధీ స్టేడియం వరకు కొనసాగింది. ఈ శకటాల ప్రదర్శనలో పాఠశాల విద్య శకటానికి మొదటి బహుమతి రాగా, వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన శకటానికి రెండో బహుమతి, గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు మూడో బహుమతి వచ్చింది. ఈ బహుమతులను ఆయా శాఖల అధికారులు ముఖ్యమంత్రి చేతులమీదుగా అందుకున్నారు.



స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల పరేడ్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో అగ్రగామిగా నిలిచి ట్రోఫీ అందుకున్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు చెందిన విద్యార్థులు

65 మంది పోలీసులకు విశిష్ట సేవా పతకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతియేటా పోలీసులకు ఇచ్చే సేవా పతకాలకు ఈ ఏడాది 67 మంది అధికారులు ఎంపికయ్యారు. వీరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. మంగళవారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అవార్డులను అందుకున్నారు. ప్రెసిడెంట్ మెడల్స్ సీనియర్ ఐఎఎస్ అధికారి భావనా సక్సేనా, పి వెంకటరామిరెడ్డి, పి సీతారామ్, ఎన్ సుధాకర్‌రెడ్డికి అందజేశారు. అలాగే పోలీస్ మెడల్స్‌ను డిఐజి ఎస్‌వి రాజశేఖర్‌బాబు, ఎం రవీంద్రనాథ్‌బాబు, నంద్యాల ఎస్‌పి కె రఘువీర్‌రెడ్డి, 6వ బెటాలియన్ కమాండెంట్ కెఎస్‌ఎస్‌వి సుబ్బారెడ్డి, గ్రేహౌండ్స్ అడిషనల్ ఎస్‌పి కె నవీన్‌కుమార్, విశాఖ డిసిపి కె సుబ్రమణ్యం, దిశ ఎసిపి వివి నాయుడు, ఎస్‌బి ఎసిపి సిహెచ్ రవికాంత్, సిఐడి డిఎస్‌పి కెవి రాజారావు, నెల్లూరు డిఎస్‌పి జె శ్రీనివాసులురెడ్డి, సిఐడి డిఎస్‌పి వి శ్రీరాంబాబు, రాజమండ్రి డిఎస్‌పి కె విజయ్‌పాల్, ప్రకాశం జిల్లా దిశ డిఎస్‌పి సి శ్రీనివాసరావు, మార్కాపురం డిఎస్‌పి జి వీరరాఘవ రెడ్డి, తిరుపతి ఎఆర్‌డిఎస్‌పి వై రవీంద్రరెడ్డి, 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పివి హనుమంతు, గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండెంట్ బి విజయకుమార్, విజయవాడ సిటి ఇన్‌స్పెక్టరు బి గున్నా రాము, శ్రీకాకుళం సిసిఎస్ ఎస్‌ఐ ఎం కోటేశ్వరరావు, విజయవాడ సిసిఎస్ ఎస్‌ఐ జి కృష్ణారావు, ఆర్‌ఎస్‌ఐ ఆర్ రామనాథం, రెండో బెటాలియన్ ఆర్‌ఎస్‌ఐ శివశంకర్‌రెడ్డి, ఎఆర్‌ఎస్‌ఐ ఎం వెంకటేశ్వర్లు, మూడో బెటాలియన్ ఎఆర్‌ఎస్‌ఐ ఎస్ సింహాచలం, గుంటూరు ఎఎస్‌ఐ టి నరేంద్రకుమార్, కడప ఎఎస్‌ఐ పి భాస్కర్, కొవ్వూరు ఎఎస్‌ఐ ఎన్ శ్రీనివాస్, విజయవాడ ఎసిబి ఎఎస్‌ఐ ఎస్ వీరాంజనేయులుకు అందజేశారు. అలాగే అసాదారణ్ ఆసూచణ కుషలత పదక్‌లకు సిఐడి ఐజి సిహెచ్ శ్రీకాంత్, ఎస్‌ఐబి ఎస్‌పి ఎ బాబ్జి, ఎస్‌ఐబి అడిషనల్ ఎస్‌పి ఇజి అశోక్‌కుమార్, విశాఖ డిఎస్‌పి ఎ వెంకటరావ్, ఎస్‌ఐబి ఎస్‌ఐ కె నిరీక్షణరావుకు పతకాలు అందించారు. 2021 పోలీస్ మెడల్స్ ఆర్ రాజశేఖర్, సిహెచ్ సాయి గణేష్, కె పాపినాయుడు, మాబ్బాష, టి కెశవరావు, ఎం మునేశ్వరరావు, ఎస్ బుచ్చిరాజు, జి హరిబాబు, బి చక్రధర్, ఎం నాని, పి అనిల్‌కుమార్‌కు సిఎం చేతులమీదుగా అందజేశారు. ముఖ్యమంత్రి శౌర్యపతకం 2023కు సంబంధించి అల్లూరి జిల్లాకు చెందిన ఇన్‌స్పెక్టర్ వి సుధాకర్, ఎస్‌ఐబి ఇన్‌స్పెక్టర్ కె విజయశేఖర్, అర్‌ఎస్‌ఐ కె హరీష్, పి రమేష్, టి రవికుమార్, టి సత్యనారాయణ, పి సతీష్‌కుమార్, సిహెచ్ శివ, బి శ్యామలరావు, ఎన్ రవి, పి నాగరాజు, ఎస్‌కె కరీమ్‌బాషా, బి వాసుదేవరెడ్డి, సయ్యద్ హబీబుల్లా, ఎస్ సిద్ధయ్య, ఎం గౌరు నాయుడుకు అవార్డులను సిఎం అందజేశారు.



ఎట్ హోమ్‌లో గవర్నరుకు పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర గవర్నరు తన బంగ్లా రాజ్‌భవన్‌లో నిర్వహించే ఎట్‌హోమ్ కార్యక్రమానికి పలువురు హాజరై గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం సాయంత్రం గవర్నర్‌పేటలోని రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్‌హోమ్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతి హాజరై గవర్నరుకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి గవర్నరుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారాం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్ అతిథుల కోసం తేనేటి విందును ఏర్పాటుచేశారు.

మహానేతల త్యాగాలను విస్మరించొద్దు

- ఎంపి విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన మహానేతల త్యాగాలను ఎప్పటికీ విస్మరించరాదని వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం ఎదుట జాతీయ జెండాను విజయసాయిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో సైనికులు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని, దేశంలోని ప్రతి పౌరుడూ సైనికుల్లా దేశభక్తి కలిగి ఉండాలని కోరారు. ప్రతి రాజకీయ పార్టీ దేశభక్తితో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు. ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, పోతుల సునీత, కుంభా రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'ను కాపాడుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరాం అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 915వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎస్‌ఎంఎస్ - 1 విభాగం కార్మికులు కూర్చున్నారు. తొలుత వారంతా రాజ్యాంగ పీఠికను చదువుతూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అయోధ్యరాం మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పంద్రాగస్టు వేడుకలు ఘనంగా జరుగుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల స్టీల్‌ప్లాంట్ కార్మికులు మాత్రం ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రజల సంపదైన స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు కేంద్రంలోని బిజెపి పాలకులకు ఎటువంటి హక్కూ లేదన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను కూడా నెలకొల్పలేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తించి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. ముస్ముందు కాలంలో ఉక్కు పరిరక్షణ పోరాటం మరింత ఉధృతం కానుందని స్పష్టం చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రయాణికుల మన్ననలు పొందాలి

- ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్ ఎ మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే అంశంలో ఆర్‌టిసికి ఏ సంస్థ సాటిరాదని, ప్రయాణికుల మన్ననలను మరింత పొందేలా ఉద్యోగులు క్రమశిక్షణతో సేవలు విస్తృతం చేయాలని ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్ ఎ మల్లికార్జునరెడ్డి సూచించారు. మంగళవారం విజయవాడలోని ఆర్‌టిసి హౌస్‌లో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుతో కలిసి మాట్లాడారు. ఎపిఎస్‌ఆర్‌టిసి ఎంతో ప్రగతి సాధించిందన్నారు. ప్రతిరోజూ 33 లక్షల మంది ప్రయాణికులను 40 లక్షల కిలోమీటర్ల మేర గమ్యస్థానాలకు చేరవేస్తోందని అన్నారు. రానున్న కాలంలో ఎపిఎస్‌ఆర్‌టిసికి మరో 1,500 కొత్త బస్సులు రానున్నాయని తెలిపారు. ఆర్‌టిసిలో ఉత్తమ సేవలు అందించిన 19 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కెఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎ కోటేశ్వరరావు, పి కృష్ణమోహన్, ఫైనాన్షియల్ అడ్వైజర్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుపై ప్రభుత్వ దృష్టి

- సెప్టెంబర్‌నుండి పైలట్ ప్రాజెక్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుండె సంబంధిత వ్యాధుల వల్ల పెరుగుతున్న మరణాల రేటును తగ్గించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో గుండెపోటువచ్చిన వారికి కీలకమైన మొదటిగంటలోనే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించే (స్టెమీ ...ఎస్‌టి ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫ్రాక్షన్) ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా గోల్డెన్ అవర్లో ఇవ్వాల్సిన రూ.40 వేల విలువైన ఇంజక్షన్‌ను ఉచితంగా అందించనున్నారు. అనంతరం మెరుగైన ఆస్పత్రికి తరలించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు వివరించారు. దీనికోసం ఇప్పటికే రూ.120 కోట్లతో ప్రభుత్వం సదుపాయాలు కల్పించింది. ఐసిఎంఆర్ సహకారంతో సాగే ఈ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 29వ తేదిన సిఎం పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించనున్నారు. జవనది నుండి రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో గుండెపోటు మరణాల రేటు రాష్ట్రంలో 32శాతంగా ఉంది తేలింది. సుమారు 38 లక్షల మంది గుండె జబ్బులతో బాధపడుతున్నారు.

సిఎం సిగ్గుతో తల దించుకుంటారా?

- వర్ల రామయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలోని ఓ గ్రామంలో దళిత మహిళపై ఐదుగురు వైసిపి నాయకులు గ్యాంగ్ రేప్ చేసిన విషయంలో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిగ్గుతో తలదించుకుంటారా? అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దళిత మహిళపై అత్యాచారం చేసిన వారిలో రాష్ట్ర మంత్రి ఉషశ్రీచరణ్ సన్నిహితుడు, వలంటీరుకు సోదరుడు హరి ఆ ఘటనలో భాగస్వామి అని తెలుస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువైందన్నారు. గ్యాంగ్‌రేప్ ఘటన పట్ల నిర్లక్ష్యం వహించిన డిఎస్‌పి, స్థానిక ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పారదర్శకంగా తనిఖీలు

- ఫార్మాసిస్టుల సమాఖ్య డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజారోగ్య రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా మెడికల్ షాపుల్లో ఔషధ తనిఖీలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఫార్మాసిస్టుల సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సింగనముల సుమన్ మంగళవారం ఇక ప్రకటన విడుదల చేశారు. కచ్చితమైన నివేదికలను కేంద్ర ఔషధ నియంత్రణ శాఖకు అందజేయాలని అన్నారు. ఫార్మాసిస్టుల సంఘాల నాయకులు కడపలో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఔషధ అధికారులను కలిసి మెడికల్ షాపుల్లో జరుగుతున్న మోసాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నూతన ఆదేశాల మేరకు ఫార్మాసిస్టులకు వారి బ్యాంకు ఖాతాల్లోనే యజమానులు జీతాలు వేసే విధానాన్ని అమలు చేయాలన్నారు. అధికారులను కలిసిన వారిలో ఫార్మా జెఎసి ఛైర్మన్ మద్దెల సురేష్‌బాబు, ఇండియన్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ కడప పట్టణ అధ్యక్షులు ఉన్నవ ఉమామహేశ్వరరావు, ఎపి ఫార్మా జెఎసి మీడియా కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ ఉన్నారని పేర్కొన్నారు.



స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో వికలాంగులకు మిఠాయిలు అందచేస్తున్న స్టాలిన్

రాష్ట్ర జాబితాలోకి విద్య

- తమిళనాడు సిఎం స్టాలిన్ డిమాండ్

చెన్నయ్ : విద్యను రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా నుండి తొలగించి, రాష్ట్ర జాబితాలో చేర్చాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యను రాష్ట్ర జాబితాలో చేరిస్తే పాఠ్య పుస్తకాలలోని విషయాలు ప్రజలను నేరుగా ప్రభావితం చేస్తాయని చెప్పారు. నీట్ వంటి జాతీయ పరీక్షలను రద్దు చేయాలని స్టాలిన్ చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. విద్యను రాష్ట్ర జాబితాలో చేరిస్తే జాతీయ పరీక్షలను రద్దు చేయవచ్చు. స్టాలిన్ తన ప్రసంగంలో రచయిత సుబ్రమణ్య భారతి వంటి మహనీయులకు నివాళులర్పించారు.

భరతమాత ప్రతి భారతీయుని వాణి

- రాహుల్

న్యూఢిల్లీ : భరతమాత ప్రతి భారతీయుని వాణి అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. దేశ ప్రజలకు ఆయన 77వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా సందేశం ఇస్తూ 145 రోజుల పాటు తాను జరిపిన భారత్ జోడో యాత్ర అనుభవాలను పంచుకున్నారు. సముద్రం అంచున యాత్రను ప్రారంభించి, కాశ్మీర్ మంచును తాకానని వ్యాఖ్యానించారు. వేడి, దుమ్ము, వర్షాన్ని దాటుకుంటూ అడవులు, పట్టణాలు, కొండల మీదుగా తనకు ఎంతో ఇష్టమైన కాశ్మీర్ మంచును చేరుకున్నానని తెలిపారు. యాత్ర సందర్భంగా ఎన్నో ఇబ్బందులు పడ్డానని, అయితే ప్రజలు ఇచ్చిన ప్రేరణ తనను ముందుకు నడిపిందని అన్నారు. 'యాత్ర ప్రారంభమైన కొద్ది రోజులకే నా పాత మోకాలి నెప్పి తిరగబెట్టింది. నా ఫిజియోథెరపిస్టు వచ్చి మునీశ్వరుడిలా కొన్ని సలహాలు ఇచ్చారు. కానీ నెప్పి అలాగే ఉంది. అప్పుడు కొన్ని విషయాలు గమనించాను. ఆగాలని అనిపించిన ప్రతిసారి, యాత్రకు విరామం ఇద్దామని అనుకుంటున్న ప్రతి సందర్భంలోనూ ఎవరో ఒకరు వచ్చి యాత్రను కొనసాగించేందుకు కావాల్సిన శక్తిని ఇచ్చే వారు' అని వివరించారు.

అశోకా వర్సిటీలో మరో ప్రొఫెసర్ రాజీనామా

న్యూఢిల్లీ : దేశ రాజధాని ప్రాంతంలోని ఆశోకా విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్ర విభాగంలో పని చేస్తున్న ప్రొఫెసర్ పులప్రే బాలకృష్ణన్ తన పదవికి రాజీనామా చేశారు. వారం రోజుల క్రితం ఇదే యూనివర్సిటీకి చెందిన ఆర్థికవేత్త సవ్యసాచి దాస్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సవ్యసాచి సమర్పించిన ఓ పరిశోధన పత్రం రాజకీయ దుమారాన్ని రేపింది. సవ్యసాచి దాస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాగా, ఇప్పుడు రాజీనామా చేసిన బాలకృష్ణన్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన గతంలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, కోజికోడ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ప్రపంచబ్యాంక్‌లలో వివిధ హోదాలలో పని చేశారు. అనేక ప్రఖ్యాతి గాంచిన పుస్తకాలు రాశారు. ఆయన రచించిన 'నెహ్రూ నుంచి మోడీ వరకూ భారత ఆర్థిక వ్యవస్థ' అనే పుస్తకాన్ని 2022లో ప్రచురించారు. బాలకృష్ణన్ రాజీనామా చేసిన విషయాన్ని అశోకా యూనివర్సిటీ ఇంకా ధ్రువీకరించలేదు. ఆయన రాజీనామా లేఖ కూడా బహిర్గతం కాలేదు. సవ్యసాచి దాస్‌కు సంఘీభావంగానే బాలకృష్ణన్ రాజీనామా చేశారని యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. సవ్యసాచి రాజీనామా గురించి 'ది వైర్' వెబ్‌సైట్ కథనాన్ని వెలువరించగానే రాజీనామాను ఆమోదించామని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సోమక్ రేచౌదరి ప్రకటించారు.

పేదల కోసం యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

రాకుండా అడ్డుకోవడం కూడా అంటరానితనమేనని అన్నారు. ఈ భావజాలంపై కూడా విజయం సాధించాలని, తాము ఆ యుద్ధమే చేస్తున్నామని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 98.05 శాతం అమలు చేశామని తెలిపారు. 50 నెలల కాలంలో డిబిటి ద్వారా రూ.2.31 లక్షల కోట్లను నేరుగా ప్రజలకు అందేలా చూశామన్నారు. అలాగే రికార్డు స్థాయిలో 2.66 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. పంట నష్టపోతే ఆ సీజన్‌లోనే పరిహారం అందించే కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. పాల రైతుల కోసం పాలవెల్లువ కార్యక్రమం తీసుకొచ్చామని చెప్పారు. పాల ధర లీటరుకు రూ.10 నుంచి రూ.22 వరకు పెంచినట్లు తెలిపారు. వికేంద్రీకరణను విధానంగా చేసుకుని ఇప్పటి వరకూ వున్న 13 జిల్లాలను 26 జిల్లాలుగా ఏర్పాటుచేశామని అన్నారు. మూడు ప్రాంతాలకూ రాజధానులు హక్కుగా ఉండేలా చూడటమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతల వారీ తీసుకుని పూర్తి చేస్తున్నామన్నారు. ఇప్పటికే సంగం, నెల్లూరు బ్యారేజీ పనులు పూర్తి చేశామని, పోలవరం పనులు జరుగుతున్నాయని అన్నారు. 2025 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. వెలిగొండలో మొదటి టన్నెల్ పూర్తి చేశామని, రెండో టన్నెల్ పనులు త్వరలోనే పూర్తవుతాయని తెలిపారు.రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోర్టుల నిర్మాణం ప్రారంభించామన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా మూడేళ్లు మన రాష్ట్రమే నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. రాష్ట్రానికి రూ.67,196 కోట్ల పెట్టుబడులతో కొత్తగా 127 భారీ పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13.42 లక్షల కోట్లకు ఎంఒయులు చేసుకున్నామన్నారు. విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు. నాడు-నేడుతో 45 వేల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేశామన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగీష్ మీడియం అమలు చేస్తున్నట్లు తెలిపారు. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ విధానం, ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబ్‌లతో విద్యారంగంలో నూతన ఒరవడిని సృష్టించామన్నారు. భోజనం, వసతి ఖర్చుల కోసం రూ.20 వేల వరకు వసతి దీవెన అందిస్తున్నామని, రోజుకో మెనూతో పౌష్టికాహారంగా గోరుముద్ద అమలు చేస్తున్నామని చెప్పారు. డిగ్రీ స్థాయిలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్న ప్రభుత్వం మనదేనని అన్నారు. వైద్యార్యోగశాఖలో కూడా పెను మార్పులు తీసుకొచ్చామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 53,126 పోస్టులను భర్తీ చేయడంతోపాటు 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటుచేశామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా పౌరసేవలను ఇంటి వద్దకే అందించేలా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, ఆర్‌బికెలను తెచ్చి గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంను తీసుకొచ్చామని తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి వైఎస్ భారతి కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎపి భవన్‌లో స్వాతంత్ర్య వేడుకలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భవన్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఎపి భవన్ ప్రాంగణంలో ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ (పిఆర్‌సి) ఆదిత్యనాథ్ దాస్, అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ (ఎఆర్‌సి) హిమాన్షు కౌశిక్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలిత ఆదిత్యనాథ్ దాస్, హిమాన్షు కౌశిక్ జెండా వందనం చేశారు. భవన్‌కు నలువైపులా మువ్వన్నెల జెండాలతో, ఎలక్ట్రిక్ బల్బులతో అలంకరించారు.



వైసిపి నాయకుల అన్యాయాలపై 'ప్రజా కోర్టు'

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాస్వామ్య దేశంలో బలమైన చట్టాలు, న్యాయ వ్యవస్థ ఉన్నప్పటికీ నేటి పరిస్థితుల్లో సామాన్యుడు కోర్టుల చుట్టూ తిరగలేని పరిస్థితులున్నాయని, జనసేన త్వరలోనే వైసిపి నాయకుల అక్రమాలు, దోపిడీలపై ప్రజా కోర్టు నిర్వహించనుందని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జనసేన వీరమహిళల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా కోర్టును ప్రజలకు ఎలా చేరువ చేయాలనేది త్వరలో నిర్ణయిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న తప్పులకు న్యాయస్థానాలు అయితే ఎలాంటి శిక్షలు వేస్తాయి? వైసిపి నాయకుల తప్పులకు న్యాయపరంగా ఎలా స్పందించాలనే విషయాలను ప్రజా కోర్టులో తేలుస్తామన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నివాసం ఉండే తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనే నేరాల రేటు ఎక్కువగా ఉందని, సిఎం నివాసానికి కూతవేటు దూరంలో ఓ అంధురాలిపై వేధింపులకు దిగి హత్య చేస్తే సిఎం, మంత్రుల నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. జగన్ అధికారంలో లేకుంటే కొత్త పథకాలు వస్తాయని, పాత పథకాలు ఏవీ ఆగిపోవని అన్నారు. కార్యక్రమంలో జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. అంతకముందు పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

ప్రజా వైద్యులు కొంగర దేవదాస్ కన్నుమూత

- వి శ్రీనివాసరావు నివాళి


ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ప్రముఖ వైద్యులు కొంగర దేవదాస్ (70) విజయవాడలో మంగళవారం కన్నుమూశారు. ఆయన తన కుమారుడు, పేరొందిన బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ కొంగర రవికాంత్ వద్ద ఉంటున్నారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తన కుమారుడి ఇంట్లో తుదిశ్వాస విడిచారు. దేవదాస్‌కు భార్య సుగుణ, కుమారులు శ్రీకాంత్, రవికాంత్, కుమార్తె ఉన్నారు. కర్నూలు వైద్య కళాశాలలో వైద్య విద్యనభ్యసించిన ఆయన నెల్లూరు ప్రజావైద్యశాలలో వైద్యులుగా పనిచేశారు. వామపక్ష ఉద్యమానికి తనవంతు సేవలందించారు. తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌లోనూ వైద్యులుగా పనిచేశారు. ఆయన కుమార్తె కూడా వైద్యురాలిగా సేవలందిస్తున్నారు. దేవదాసు భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



రెండో దశ రైతు పోరాటానికి సన్నద్ధం

- ఆగస్టు 24న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి
- రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు



విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా రెండో దశ రైతు పోరాటానికి సన్నద్ధం కావాలి, ఈ నెల 24న చేపట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగాన్ని తెగనమ్మడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుండడం దుర్మార్గమన్నారు. విజయవాడలోని స్వతంత్ర్య సమరయోధుల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జాతీయ జెండాను రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు ఆవిష్కరించారు. దేశ స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందామంటూ, మోడీ కో హటావో.. దేశ్ కో బచావో నినాదంతో 77వ స్వతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు మంగళవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని, అందులో భాగంగానే మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చిందని తెలిపారు. రైతాంగం నిర్వహించిన చారిత్రాత్మక పోరాటం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, అయితే, అవే చట్టాలను దొడ్డిదారిన మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నిస్తుండడం మోసగించడమేనని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర, రైతు రుణమాఫీ తదితర అంశాలపై పోరాడుతున్న వారిపై అక్రమంగా కేసులు పెడుతుండడం దారుణమని తెలిపారు. మణిపూర్‌లోనూ, హర్యానాలోనూ మత మరణకాండను సృష్టించి దేశ సమగ్రతకు, మతసామరస్యతకు భంగం కలిగిస్తోందని విమర్శించారు. స్వతంత్ర్య సమరయోధుల సీనియర్ సిటిజన్స్ కార్యాలయ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, ఎఐకెఎఫ్ రాష్ట్ర నాయకులు కాసాని గణేష్, ఎపి రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి పి.వి.ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు కోగంటి ప్రసాదు, కోగంటి కోటయ్య, సుంకర మురళి తదితరులు పాల్గొన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. 'మోడీని సాగనంపుదాం... దేశాన్ని కాపాడుకుందాం, మతసామరస్యం, లౌకికతత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఎఐకెకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.రంగనాథ్, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా నాయకులు కె.కృష్ణమాచార్యులు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు తదితరులు ప్రసంగించారు.

నాటు తుపాకీకి చిన్నారి బలి

ప్రజాశక్తి- కోటనందూరు (కాకినాడ జిల్లా)



ధన్యశ్రీ (ఫైల్)

కాకినాడ జిల్లా తుని రూరల్ లోవకొత్తూరు దళిత కాలనీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నాటు తుపాకీ తూటా గురితప్పి చిన్నారికి తగిలింది. దీంతో, ఆమె మృతి చెందింది. మంగళవారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి తుని రూరల్ సిఐ సన్యాసిరావు కథనం ప్రకారం... లోవకొత్తూరుకు చెందిన సిద్ధాంతం దుర్గాప్రసాద్ తన పెంపుడు పందిని నాటు తుపాకీతో పేలుస్తుండగా గురి తప్పి అదే సమయంలో రోడ్డు మీద ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారి పలివెల ధన్యశ్రీకి తగిలింది. బాలిక ఛాతీలో నుంచి వీపులోకి తూటా దూసుకుపోవడంతో అక్కడికక్కడే కుప్పకూలింది. స్థానికులు ఆమెను ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలిక మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. తుని రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ బస్సు బోల్తా..

- 20 మంది విద్యార్థులకు గాయాలు.

ప్రజాశక్తి-అమర్తలూరు (బాపట్ల జిల్లా)

స్కూల్ బస్సు బోల్తా పడి 20 మంది విద్యార్థులు గాయాలపాలైన ఘటన బాపట్ల జిల్లా అమర్తలూరు మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పాఠశాల యాజమాన్యం తెలిపిన వివరాల మేరకు... కూచిపూడి గ్రామానికి చెందిన స్కేర్డ్ హార్ట్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు మంగళవారం పాఠశాలలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. మొత్తం 45 మంది విద్యార్థులు తిరిగి స్కూల్ బస్సులో ఇళ్లకు బయలుదేరారు. కూచిపూడి-పెదపూడి గ్రామాల మధ్య అదే పాఠశాలకు చెందిన మరొక బస్సును ఓవర్ టేక్ చేయబోయిన బస్సు డ్రైవర్ ఎదురుగా ఆర్‌టిసి బస్సు రావడంతో పక్కకు తిప్పాడు. దీంతో సమీపంలోని పొలాల్లోకి స్కూల్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మొత్తం 20 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వెంటనే చిన్నారులను తెనాలిలోని హెల్త్ హాస్పిటల్‌కు తరలించారు. ఒక విద్యార్థి తలకు దెబ్బ తగలడంతో స్కానింగ్ తీయించారు. ఎటువంటి ప్రమాదమూ లేదని వైద్యులు తెలిపారు.

వైద్య కళాశాలలో సీనియర్లపై జూనియర్ దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఇద్దరు సీనియర్ విద్యార్థులపై ఓ జూనియర్ విద్యార్థి దాడికి పాల్పడిన ఘటన తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో మంగళవారం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరూ రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం మేరకు... 2018 బ్యాచ్ విద్యార్థులు నందలూరు మహేష్, ప్రవీణ్, 2019 బ్యాచ్ విద్యార్థి కాన్కూర్ గణేష్ వైద్య కళాశాలలో చదువుతున్నారు. ఎస్‌వి యుజి హాస్టల్‌లో మంగళవారం తెల్లవారుజామున గణేష్ ఆవేశంతో సీనియర్లు గదికి వచ్చి మహేష్ గొంతును సర్జికల్ బ్లేడ్‌తో కోశాడు. తలపై స్టంపుతో దాడి చేశాడు. పక్కనే ఉన్న ప్రవీణ్ తలపైనా క్రికెట్ స్టిక్‌తో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. గాయాలపాలైన ఇద్దరిని తోటి విద్యార్థులు హుటాహుటిన తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మహేష్‌కు ఆపరేషన్ చేశారు. అయినా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. తలకు గాయాలయిన ప్రవీణ్‌కు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వెస్ట్ పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించారు. దాడికి పాల్పడిన విద్యార్థి కోసం గాలింపు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీనియర్, జూనియర్ వైద్య విద్యార్థుల మధ్య ర్యాగింగ్ విషయమై గొడవ చోటుచేసుకుందని, ఓ అమ్మాయి వ్యవహారమై గతంలో సీనియర్స్ గణేష్‌ని ముందలించడంతో కక్ష పెంచుకొని దాడి చేశాడని, రకరకాల కథనాలు వినబడుతున్నాయి.

ఆంక్షల చట్రంలో లోకో పైలెట్లు

నిబంధనల పేరుతో 100 మందిపై చర్యలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం మానిటైజేషన్‌లో భాగంగా రైల్వేలను ఒక వైపు ప్రైవేటీకరిస్తుండగా, కీలకమైన లోకోపైలెట్లను ఆంక్షల చట్రంలోకి రైల్వే బోర్డు నెట్టివేస్తోంది. ఇప్పటికే వీరికి సహాయకారిగా ఉండే సిబ్బందిని రైల్వే బోర్డు తొలగించింది. అదే సమయంలో రైలు ఇంజన్‌లో ఉండే టూల్ కిట్స్ (లైన్ బాక్స్)లోని వస్తువులను లోకో పైలెట్లు తమతో పాటే డ్యూటీకి వచ్చే సమయంలో వెంట తెచ్చుకోవాలని,విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేటప్పుడు వెంట తీసుకెళ్ళాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. లోకో పైలెట్లలో కొందరు దీనికి నిరాకరిస్తుండతో వారిపై చర్యలు కూడా తీసుకుంటున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఇప్పటికే సుమారు 100మంది రన్నింగ్ సిబ్బందిపై చార్జిషీట్లు, మెమోలు, సస్పెన్షన్లపేరుతో వేటు వేసింది. ఖాజీపేట డివిజన్‌లో టూల్ కిట్స్ తాను మోసుకుపోనని తెగేసి చెప్పిన లోకో పైలట్ ఒకరినిసస్పెండ్ చేశారు. లోకో పైలెట్లు ఒక సారి డ్యూటీకి వెళితే తిరిగి ఇంటికి మూడు రోజుల తర్వాత కానీ వచ్చే పరిస్థితులుండవని, మూడు రోజులకు సరిపడా తమ లగేజీని రన్నింగ్ రూముల వద్దకు ఇప్పటికరే మోయలేక పోతున్నామని వారు చెబుతున్నారు. దీనికి అదనంగా తాజాగా 40 కేజీలుండే టూల్ కిట్స్‌ను మోసుకుని పోవాల్సివస్తోందని, ఇది సాధ్యం కావడం లేదని వారు అంటున్నారు. రైలు ఇంజన్‌లో ఉండే టూల్ కిట్స్‌లో ఉండే వస్తువులతో పాటు డిటోనైటర్స్(జిలిటెన్‌స్టిక్స్ లాంటివి) కూడా వెంట తీసుకెళాల్లని రైల్వే అధికారులు ఒత్తిడి చేస్తున్నారని లోకో పైలెట్లు ఆరోపిస్తున్నారు. వీటిని ప్రయాణీకుల మధ్య నుండి తీసుకువెళ్లడం ప్రమాదకరమని చెబుతున్నారు. గతంలో రైలు డ్రైవర్ క్యాబిన్‌లో టూల్‌కిట్స్ ఉండేవని. రైలు బయలుదేరే ముందు సిబ్బంది కిట్స్‌ను టూల్‌బాక్స్‌లో లోడ్ చేసేవారని, రైలు గమ్యం చేరిన అనంతరం టూల్‌కిట్స్‌లోని పనిముట్లను సిబ్బంది తీసుకెళ్లి భద్రపరిచే పరిస్థితులుండేవని ఉద్యోగులు పేర్కొంటున్నారు. కొంత కాలం వారి స్థానంలో కాంట్రాక్టు ఉద్యోగులు అప్‌లోడ్ చేసేవారని లోకోలు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ సిబ్బందిని కూడా తొలగించారని సిబ్బంది వాపోతున్నారు. ఇది ఇలా ఉంటే గతంలో డ్యూటీకి వె ళ్లే టప్పుడు వాకీటాకీలు లోకోలు తీసుకెళ్లేవారని, డ్యూటీ దిగిన వెంటనే వాకీ టాకీలనే రైల్వే సిబ్బందికి అప్పజెప్పేవారని చెబుతున్నారు. ఇప్పుడు డ్యూటీ దిగిన అనంతరం వాకీటాకీలను ఇంటికి తీసుకెళ్లి చార్జింగ్ పెట్టి డ్యూటీకి వచ్చేటప్పుడు వెంట తీసుకురావాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఎక్కడా అమల్లో లేని విధానాలను ఒక్క దక్షిణ మధ్య రైల్వేలో అమలు చేస్తుండటాన్ని ఉద్యోగ సంఘాలు తప్పుపడుతున్నాయి.

చార్జిషీట్లను ఉపసంహరించాలి:

ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్

డిటోనేటర్లను బహిరంగ ప్రదేశంలో తీసుకెళ్లడం సురక్షితం కాదని, లైన్‌బాక్స్‌లో దశాబ్దం పాటు అమలు చేసిన విధానాన్ని అమలు చేయకుండా డిటోనేటర్లను బయటకు తీసుకెళ్లడానికి నిరాకరించిన 100మంది సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, తక్షణమే చర్యలను ఉపసంహరించాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు మంగళవారం సెక్రటరీ జనరల్ కెసి జేమ్స్ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరుకు లేఖ రాశారు. డిటోనేటర్లను టిన్‌కేస్‌లో కాగితాన్ని చుట్టి భద్రపరచాలని, టిన్‌కేస్ దిగువున పై భాగంలో వేస్ట్ కాటన్ పొరను ఉంచి వాటిని చెక్కపెట్టల్లో నిల్వచేయాలని సూచించారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని దీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



దీక్ష చేపట్టిన ఇపిఎఫ్ 95 పెన్షన్‌దారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు ఇవ్వాలని, పెన్షనర్లందరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మాకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించండి' అంటూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎపిఆర్‌పిఎ) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. తొలుత సంఘం సీనియర్ నాయకులు సనపల ఆంజనేయులు జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఎపిఆర్‌పిఎ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె దీనబంధు, ఎస్‌కె హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా వృద్ధులకు ఇచ్చే సామాజిక పింఛను డబ్బులు కన్నా ఇపిఎఫ్ 95 పెన్షన్‌దారులకు తక్కువ డబ్బులే వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అవి నెలవారీ మందులకైనా సరిపోవడం లేదన్నారు. దీంతో పిల్లలపైన ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. అధిక ధరలు, అనారోగ్యం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరారు.

ఈ దీక్షకు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి కుమార్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో - కన్వీనర్ కెఎం కుమార్ మంగళం, సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్ల సంఘం నాయకులు చంద్రశేఖర్, టిఎన్‌టియుసి నాయకులు టి కృష్ణ, ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పడు, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి డిఎస్‌ఆర్‌సి మూర్తి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ చలపతి, కె నూకరాజు, వి తులసీరాం పాల్గొన్నారు.

త్యాగధనులతోనే స్వాతంత్ర్య ఫలాలు

- ఎస్‌బిఐలో జాతీయ జెండావిష్కరణ



హైదరాబాద్ : నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) లోకల్ హెడ్ ఆఫీస్‌లో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ జాతీయ జెండావిష్కరణ చేశారు. దేశ నిర్మాణంలో, ప్రజలకు సేవల చేయడంలో బ్యాంక్ ఉద్యోగుల పాత్ర కూడా కీలకంగా ఉందని రాజేష్ కుమార్ అన్నారు. అనేక మంది త్యాగలతోనే స్వాతంత్ర్యం వచ్చింద న్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో నేడు భారత్ కూడా ఒక అగ్రగామిగా ఉందన్నారు. పేదలకు, దేశ ఆర్థిక వ్యవస్థకు సేవలందించడంలో ఎస్‌బిఐ కీలక పాత్ర పోశిస్తుందన్నారు. జెండావిష్కరణ కార్యక్రమంలో ఎస్‌బిఐ జనరల్ మేనేజర్ ఎన్‌డబ్ల్యు-2 దేబాశిష్ మిత్రా, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓలా నుంచి మూడు కొత్త బైక్‌లు!



బెంగళూరు : విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీదారు ఓలా ఎలక్ట్రిక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మూడు కొత్త వాహనాలను విడుదల చేసింది. ఓలా ఎలక్ట్రిక్ ఎస్1 ఎక్స్‌ను మూడు వేరింట్లలలో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. బడ్జెట్ ధరలో ఓలా ఎస్ 1 ఎక్స్‌తో పాటు ఓలా ఎస్1 ప్రో జనరేషన్ 2లను ఆవిష్కరించింది. ఎక్స్‌షోరూం వద్ద ఓలా ఎస్1 ఎక్స్ ధర రూ.79,000గా, ఓలా ఎస్1 ప్రో జనరేషన్ 2 ధరను రూ.1.47 లక్షలుగా నిర్ణయించింది. పొదుపు చర్యల్లో భాగంగా వాహన తయారీ కోసం బ్లాక్ ప్లాస్టిక్‌ను ఉపయోగించింది. త్వరలో విద్యుత్ బైకులను విడుదల చేస్తామని ఓలా వెల్లడించింది. డైమండ్ హెడ్, అడ్వెంచర్, రోడ్‌స్టర్, క్రూయిజర్ పేర్లతో వీటిని విడుదల చేయనుంది. మంగళవారం నాటి కార్యక్రమంలో ఈ కాన్సెప్ట్ బైక్‌లను ప్రదర్శించింది. వీటి పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంది. 2024 చివరికల్లా వీటిని తీసుకురానుందని తెలుస్తోంది.

లిబర్టీ గ్లోబల్‌తో ఇన్ఫోసిస్ భారీ డీల్

బెంగళూరు : దిగ్గజ ఐటి కంపెనీ ఇన్ఫోసిస్‌కు లిబర్టీ గ్లోబల్‌తో భారీ ఒప్పందం జరిగింది. ఐదేళ్ల కాలపరిమితితో 2.5 బిలియన్ డాలర్ల విలువ చేసే కాంట్రాక్ట్ దక్కింది. లిబర్టీ గ్లోబల్ టెక్నలాజీ సర్వీసెస్‌కు ఇన్ఫోసిస్‌ను మద్దతును అందించనుంది. ఆ సంస్థకు చెందిన ప్రపంచంలోని వినియోగదారులకు ఇన్ఫోసిస్ ద్వారా ఎఐ, ఇతర టెక్నలాజీ సేవలు అందనున్నాయి.

ప్రజలపై మోడీ యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మతోన్మాద మూకలు హత్య చేశాయి. అంతటి తీవ్ర కేసులో శిక్ష పడ్డ నిందితులను కేంద్రంలో, గుజరాత్‌లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు స్వాతంత్ర్య రోజున క్షమాభిక్షపై విడుదల చేశాయి. ఇది అత్యంత దారుణమైనది. పరిపాలన, విధాన పరమైన లోపాలు జరిగాయి. ముద్దాయిలకు క్షమాభిక్ష... మతపరంగా టార్గెట్ చేసి రేప్ చేసినా విడుదల కావొచ్చన్న సందేశం ఇచ్చినట్లయింది.

ప్రశ్న: హక్కుల కార్యకర్తగా, మడమ తిప్పని జర్నలిస్టుగా పోరాడుతున్న మీకు పౌర సమాజం నుంచి ఎటువంటి మద్దతు లభిస్తోంది?

జవాబు: నా పోరాటానికి పలు ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు, ఎన్‌జిఒలు, అభ్యుదయవాదులు, ప్రజాస్వామ్య, సెక్యులరిస్టుల నుంచి అపూర్వ మద్దతు లభించింది. నాపై రాజ్యం తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసినప్పుడు దేశ వ్యాప్తంగా పలువురి నుంచి సంఘీభావం లభించింది. పౌర సమాజం నుంచి వస్తున్న ఈ విశాల మద్దతు పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నైతిక బలం ఇస్తోంది. నాలో ఆత్మస్థైర్యం నింపుతోంది.

ప్రశ్న: స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లయిన వేళ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కుల భవితవ్యం గురించి...

జవాబు: 1975లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారు. అప్పుడు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. నేను అప్పుడు టెన్త్ క్లాస్‌లో ఉన్నాను. ప్రజలు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమించి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకు న్నారు. మళ్లీ ఇప్పుడు బిజెపి కేంద్రంలో వచ్చాక రాజ్యాంగ హక్కులకు, ప్రజాస్వా మ్యానికి ముప్పు వచ్చింది. నాటి ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో ప్రజలు పోరాడాలి.

ప్రశ్న: మణిపూర్ ఊచకోత, హర్యానా పరిస్థితులు దేశానికి ఏం సూచిస్తున్నాయి?

జవాబు: 2002లో గుజరాత్‌లో మల్లేనే 2023లో మణిపూర్‌లో కిరాతకాలు జరుగుతున్నాయి. ఊచకోతను అణచివేయడంలో అక్కడి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కేంద్రంలో, రాష్ట్రంలో బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వమే ఉంది. మూడు నెలల తర్వాత పార్లమెంట్‌లో హోం మంత్రి అత్యంత బాధ్యతారహితంగా మాట్లాడారు. మణిపూర్ ఘోరాలకు అస్సలు జవాబుదారీ తీసుకోవట్లేదు. హర్యానాలో మత అల్లర్లు ఎందుకు సంభవించాయి? కారకులెవరు? శాంతి సామరస్యం నెలకొల్పాల్సిన ప్రభుత్వాలు ఎందుకు కళ్లప్పగించి చూస్తున్నాయి?


ప్రశ్న: దేశంలో లౌకికవాదాన్ని పరిరక్షించుకోడానికి యువత, మహిళలకు మీరు ఇచ్చే సలహా?

జవాబు: సలహాలిచ్చేంత పెద్ద వ్యక్తిని కాదు. నేను చాలా చిన్న వ్యక్తిని. ప్రస్తుతం సెక్యులరిజానికి ప్రమాదం ఏర్పడింది. అప్రమత్తంగా ఉండి సమర్ధవంతంగా ఎదుర్కోవాలి. సెక్యులరిజం లేనిదే మన దేశం లేదు. రక్షించుకునే బాధ్యతను యువత చేపట్టాలి.

పంచాయతీలకు పూర్వవైభవం

- పసుపు రైతులకు మద్దతు ధర పెంపు : లోకేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



పంచాయతీలకు పూర్వవైభవం తెస్తామని, కేంద్రం నుంచి వచ్చే నిధులను నేరుగా పంచాయతీలకు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర గుంటూరు జిల్లాలో కొనసాగింది. మంగళవారం మంగళగిరి మండలం నిడమర్రు నుంచి ప్రారంభమైన పాదయాత్ర బేతపూడి, మంగళగిరి టౌన్, నవులూరు మీదుగా యర్రబాలెం వరకు సాగింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా చేతపట్టి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం నాయకులు ఆయనను కలిశారు. వివిధ తరగతుల ప్రజలతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖా మంత్రిగా గ్రామాల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేశానని, ప్రధానంగా దళితవాడలు, బడుగులు నివసించే ప్రాంతాలకు సిమెంటు రోడ్లు వేశామని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై సర్పంచుల పోరాటానికి మద్దతు పలికారు. ముస్లిములు లోకేష్‌ని కలిసి స్థానికంగా ఉన్న పలు సమస్యలను వివరించారు. పాదయాత్ర సందర్భంగా అనేక కుటుంబాలు లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరాయి. వైసిపి నాయ కులు గాదె లక్ష్మారెడ్డి, సుంకర రఘుపతిరావు, కుక్కమళ్ల శ్రీనివాసరావు, నాగళ్ల శీధర్, తోట శ్రీనివాసరావు తదితరులు వారిలో ఉన్నారు.

పసుపురైతులతో భేటీ

దుగ్గిరాలకు చెందిన పసుపు రైతులు నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గిట్టుబాటు ధర లేక నాలుగేళ్లుగా నష్టపోతున్నామని తెలిపారు. ఆర్‌బికెల్లో వైసిపికి అనుకూలంగా ఉన్న వారిపేర్లను మాత్రమే నమోదు చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ టిడిపి అధికారంలోకి రాగానే మద్దతు ధర పెంచేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అదరగొట్టిన ప్రభుత్వ బ్యాంక్‌లు రెట్టింపైన లాభాలు

- తొలి త్రైమాసికంలో రూ.35వేల కోట్లు
- అంచనాలకు మించి ఆదాయాలు
- ఎన్‌ఐఎంలో బిఒఎం టాప్
- తగ్గిన మొండి బాకీలు



హైదరాబాద్ : దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా ఉన్నా ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు మెరుగైన ప్రగతిని కనబర్చాయి. ఆదాయ, లాభాల్లో అదరగొట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో అన్ని పిఎస్‌బిలు స్థూలంగా రూ.34,774 కోట్ల నికర లాభాలు సాధించాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 12 ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు రూ.15,306 కోట్ల లాభాలు ప్రకటించాయి. దీంతో పోల్చితే గడిచిన క్యూ1 లాభాల్లో రెట్టింపు పైగా ప్రగతిని సాధించాయి. అధిక నికర వడ్డీ ఆదాయం, నికర వడ్డీ మార్జిన్లు బ్యాంక్‌లకు ప్రధాన మద్దతును అందించాయి. మొండి బాకీలు భారీగా తగ్గడం కలిసి వచ్చింది.

2023 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో అధిక నికర వడ్డీ మార్జిన్లు (ఎన్‌ఐఎం) సాధించిన వాటిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఒఎం) అగ్రస్థానంలో ఉంది. ఆ బ్యాంక్ ఎన్‌ఐఎం 3.86 శాతంగా చోటు చేసుకుంది. ఆ తర్వాత స్థానంలో సెంట్రల్ బ్యాంక్ 3.62 శాతం, ఇండియన్ బ్యాంక్ 3.61 శాతం చొప్పున ఎన్‌ఐఎంను నమోదు చేశాయి. ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన క్యూ1లో పిఎస్‌బిల నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) 26.3 శాతం వృద్ధితో రూ.99,114 కోట్లకు చేరాయి. రుణాల జారీలో 16 శాతం పెరుగుదల నమోదయ్యింది. డిపాజిట్లు 13.2 శాతం వృద్ధి చోటు చేసుకుంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) రికార్డ్ స్థాయిలో వృద్ధిని నమోదు చేసింది. పిఎన్‌బి 307 శాతం వృద్ధితో రూ.1.255 కోట్ల నికర లాభాలు సాధించింది. 2022-23 క్యూ1లో రూ.308 కోట్ల లాభాలతో సరిపెట్టుకుంది.

ఎస్‌బిఐకే సగం వాటా..

దేశంలో దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) గడిచిన త్రైమాసికంలో 178 శాతం వృద్ధితో రూ.16,884 కోట్ల నికర లాభాలు సాధించింది. పిఎస్‌బిల మొత్తం లాభాల్లో ఎస్‌బిఐ సగం వాటాను కలిగి ఉండటం విశేషం. మరో ఐదు పిఎస్‌బిలు 50-100 శాతం వృద్ధిని సాధించగా.. అందులో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర టాప్‌లో ఉంది. బిఒఎం 95 శాతం పెరుగుదలతో రూ.882 కోట్ల లాభాలు ఆర్జించింది. ఆ తర్వాత స్థానంలో బ్యాంక్ ఆఫ్ బరోడా 88 శాతం వృద్ధితో రూ.4,070 కోట్ల లాభాలు ప్రకటించింది. యూకో బ్యాంక్ 81 శాతం పెరిగి రూ.581 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. గడిచిన జూన్ త్రైమాసికంలో డజన్ పిఎస్‌బిల్లో ఢిల్లీ కేంద్రంగా పని చేస్తోన్న పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ ఒక్కటి మాత్రమే 25 శాతం తగ్గుదలతో రూ.153 కోట్ల లాభాలు నమోదు చేసింది. బ్యాంక్‌ల స్థూల నిరర్థక ఆస్తులు (జిఎన్‌పిఎ) 3.9 శాతానికి తగ్గి 10 ఏళ్ల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యాయి. గడిచిన ఎనిమిదేళ్లలో బ్యాంక్‌లు రూ.8.6 లక్షల కోట్ల మొండి బాకీలను వసూళ్లు చేశాయి.

సంపాదకీయం

వాగాడంబర విన్యాసం!

ఎర్రకోట సాక్షిగా వరుసగా పదో ఏటా ప్రధాని తన వాగాడంబర విన్యాసాన్ని చాకచక్యంగా కొనసాగించారు. 'అతి త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ.. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం... 2075 నాటికి రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ'గా ఆవిర్భవిస్తుందంటూ పాత పాటే పాడారు. గతంలో సోదరీ సోదరులంటూ సంభోదించే ప్రధాని ప్రజలందరినీ తన కుటుంబంగా అభివర్ణించారు. భారత్ ఇప్పుడు విశ్వ మిత్రగా మారిందని, ప్రపంచ సంక్షేమానికి బలమైన పునాదులు వేస్తోందని ప్రకటించేశారు. ఆ కుటుంబ పెద్ద... మణిపూర్ మండిపోతున్నా.. తోబుట్టువుల్లా కలిసిమెలిసి ఉండే మైతీలు, కుకీలు కత్తులు దూసుకుని..కుత్తుకలు కోసుకుంటున్నా... మానవతుల మానప్రాణాలు మంటగలిసి పోతున్నా...150 మందికిపైగా ప్రాణాలు పోగొట్టుకున్నా...మూడు నెలలకుపైగా మూగనోము పట్టడం వెనుక మర్మమేమిటో మాత్రం విడమర్చలేదు. అతి దారుణమైన వీడియో వైరల్ అయి.. భారత ప్రధాన న్యాయమూర్తి ఆగ్రహిస్తే తప్ప నోరుపెగలలేదు. అవిశ్వాస తీర్మానం పెడితే తప్ప... పార్లమెంటులో రెండు గంటలకుపైగా ప్రసంగంలో రెండు నిమిషాలు మాట్లాడడానికి మనసొప్పలేదు. ప్రపంచమంతా దుమ్మెత్తిపోస్తున్న వేళ...అక్కడ శాంతియుత పరిస్థితులు నెలకొంటున్నాయని, దేశం అండగా ఉంటుందని చెప్పుకొచ్చారు. వారికి ఏవిధమైన భరోసా ఇస్తారన్న అంశం చెప్పనేలేదు.

అవినీతి, వారసత్వ, బుజ్జగింపు రాజకీయాలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నాయని, కుటుంబం చేత, కుటుంబం కోసం, కుటుంబానికి మేలు అన్నట్టుగా తయారయ్యాయని, వాటిని తుదముట్టించాలని ప్రవచించారు. అదానీ, అంబానీ కుటుంబాలను ప్రపంచంలోనే అతిపెద్ద సంపన్నులుగా తీర్చిదిద్దేందుకు వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేసిన తీరును, కార్పొరేట్ కుటుంబాలకు పోర్టులు, టెలికం సహా సమస్త రంగాలనూ.. మన రాష్ట్రంలోని గంగవరం పోర్టు, విశాఖ స్టీల్ సహా ప్రజలు సమకూర్చుకున్న దేశ సంపదనంతా దోచిపెడుతున్న మోడీ సర్కార్ ఇది ఏ తరహా బుజ్జగింపో సెలవిస్తే బాగుండేది. కాషాయ పార్టీలో పెత్తనం చేస్తున్న వారసత్వ రాజకీయాలను తుదముట్టించడం గురించి, 40 పర్సంట్ కమిషన్ల గురించి ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు.

2004 నుంచి 2014 వరకూ 7.8 శాతం అభివృద్ధితో ముందుకెళ్లిన దేశం... గత తొమ్మిదేళ్లలో 5.7 శాతానికి ఎందుకు పడిపోయింది? నోట్ల రద్దు, జిఎస్‌టి తదితరాలు ఆర్థిక వ్యవస్థను తిరోగమనం వైపు నడిపాయన్న ప్రపంచవ్యాప్త విశ్లేషణలను ఉద్దేశపూర్వకంగానే దాట వేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు.. తయారీ రంగంలో 2022 నాటికి 10 కోట్ల ఉద్యోగాలు, మేక్ ఇన్ ఇండియా...వంటి వాగ్దానాల అమలుపై నోరువిప్పలేదు. 2014 నుంచి 2022 మధ్య 22 కోట్ల మంది ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటే 7.5 లక్షల మందికే ఉద్యోగాలొచ్చాయని లోక్‌సభ సాక్షిగా మంత్రి వెల్లడించారు. అంటే వెయ్యి మంది దరఖాస్తుదారుల్లో ముగ్గురికే ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. రైతుల ఆదాయం రెండింతల పెంపు, వంద స్మార్ట్ సిటీలు, అందరికీ ఇళ్లు, ప్రతి ఇంటికీ విద్యుత్, మరుగుదొడ్లు... వంటి హామీలన్నీ ఎన్నికల జుమ్లాలుగా మారిపోయిన వైనాన్ని మరిచినట్టున్నారు. ఒక్కరోజు ముందే రిటైల్ ద్రవ్యోల్బణం 15 నెలల గరిష్ట స్థాయికి చేరిందని, కూరగాయల ధరలు నెలవారీగా 38 శాతం పెరిగాయని గణాంకాల మంత్రిత్వశాఖ లెక్కలే చెబుతున్నాయి. అయినప్పటికీ, విపరీతంగా పెరుగుతున్న ధరలతో ప్రజలు నానా అవస్థలు పడుతుంటే ద్రవ్యోల్బణాన్ని విజయవంతంగా నియంత్రించగలిగామని చెప్పుకున్నారు. దేశంలో 74 శాతం మంది ప్రజలకు ఇప్పటికీ ఆరోగ్యకరమైన ఆహారం అందుబాట్లో లేదన్న ఐక్యరాజ్య సమితి నివేదికను పక్కనపెట్టి, ఐదేళ్లలో 13.5 కోట్ల మందిని పేదరికం నుంచి బయట పడేశామని ఎర్రకోట బురుజుల నుంచి ప్రకటించడం అతి పెద్ద జోక్.

నారీశక్తి, భరతమాత గురించి గొప్పగా చెప్పారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్‌భూషణ్‌పై చర్య కోసం మూడు నెలలు పోరాడిన మహిళా రెజ్లర్లపై ఢిల్లీ పోలీసుల దాష్టీకాన్ని తెలివిగా దాటవేశారు. గృహ రుణాలపై రాయితీ, విశ్వకర్మ, జన ఔషధి కేంద్రాల పెంపు తదితర ఎన్నికల జుమ్లాలకు ఎర్రకోటను వేదికగా చేసుకున్నారు. కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతూ, మరోవైపున మత విద్వేషాన్ని రెచ్చగొడుతున్న పాలకులకు బుద్ధి చెప్పాల్సిన తరుణం ఆసన్నమైంది.

మహనీయుల మాట



కుటుంబానికి మూలస్తంభం స్త్రీ. మహిళల స్థితి బాగుపడితే గాని దేశం బాగుపడదు.

- కందుకూరి వీరేశలింగం

అంతర్జాతీయం

పాక్ ఎన్నికల వేళ ఇమ్రాన్ ఖాన్ ఖైదు



పాక్-అమెరికా అధికారులు సమావేశమైన నెల రోజుల తరువాత ఖాన్ ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు, పదవి నుంచి తప్పించారు. అప్పటి నుంచి కొద్ది రోజుల్లోనే పాక్ విదేశాంగ వైఖరి మారిపోయింది. ఉక్రెయిన్ వివాదంలో అమెరికా, ఐరోపా పక్షాన చేరింది. అంతే కాదు, ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధాలు, మందుగుండును తయారు చేసి పంపుతున్నది. ఆగస్టు మూడవ తేదీన వచ్చిన వార్తల ప్రకారం అమెరికాతో పాకిస్తాన్ ఒక రక్షణ ఒప్పందాన్ని కూడా కుదుర్చుకుంది.



ఎం. కోటేశ్వరరావు

ఆగస్టు పదవ తేదీన పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీని రద్దు చేస్తూ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సిఫార్సు చేశారు. దాన్ని ఆమోదించిన అధ్యక్షుడు అరీఫ్ అల్వీ పద్నాల్గవ తేదీన తాత్కాలిక ప్రధానిగా అన్వార్ ఉల్ హక్ కాకర్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. పాక్ రాజ్యాంగం ప్రకారం అసెంబ్లీ రద్దు తరువాత ఏర్పడే తాత్కాలిక ప్రభుత్వ ఆధ్వర్యంలో మూడు నెలల్లోగా ఎన్నికలు జరగాలి, ఆ మేరకు నవంబరు ఎనిమిదవ తేదీ లోపు ఎన్నికలు జరిపి కొత్త సభ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గత ఏడాది అవిశ్వాస తీర్మానంతో ప్రధాని పదవి కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్ మీద అవినీతి కేసు మోపి మూడేళ్ల జైలు శిక్ష విధించి ఆగస్టు ఐదవ తేదీన జైలుకు పంపారు. ఐదు సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడిగా ఎన్నికల సంఘం ప్రకటించింది. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ అధికారానికి వచ్చినా అది పాక్ మిలిటరీ కనుసన్నలలో నడవాలనేది గత 76 సంవత్సరాల అనుభవం వెల్లడించింది.

ఇమ్రాన్ ఖాన్ పదవీచ్యుతి వెనుక అమెరికా హస్తం ఉన్నట్లు అమెరికాకు చెందిన ఇంటరెసెప్ట్ అనే మీడియా సంస్థ తనకు దొరికిన పాక్ అధికారిక పత్రాలను ప్రచురించింది. ఆ పత్రం వాస్తవమైనదే అని ఇమ్రాన్ ఖాన్ తరువాత పదవిలోకి వచ్చిన షెహబాజ్ షరీఫ్ అంగీకరించాడు. ఉక్రెయిన్ సంక్షోభంపై పాకిస్తాన్ తటస్థ వైఖరిని తీసుకోవటాన్ని రష్యా అనుకూల వైఖరిగా అమెరికా పరిగణించింది. ఉక్రెయిన్‌కు మద్దతుగా పాక్ నిలవాలని అంతకు ముందే ఐరోపా దేశాల రాయబారులు బహిరంగంగా పిలుపునిచ్చారు. గతేడాది మార్చి ఆరవ తేదీన అమెరికా-పాక్ అధికారుల సమావేశం జరిగింది. దానికి ఒక రోజు ముందే ఇమ్రాన్ ఖాన్ ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ ఐరోపా రాయబారుల మీద స్పందిస్తూ "మేము మీకేమైనా బానిసలమా? మా గురించి మీరేమనుకుంటున్నారు? మేం బానిసలమని, మీరేం కోరితే మేమది చేయాలని అనుకుంటున్నారా? మేము రష్యాకు స్నేహితులం, మేము అమెరికాకూ స్నేహితులమే, మేము చైనా, ఐరోపాకూ స్నేహితులమే, మేము ఎవరి కూటమిలోనూ లేము" అని స్పష్టం చేశాడు. ఈ మాటలు అమెరికా అహాన్ని దెబ్బతీశాయి. దశాబ్దాల తరబడి తమ కనుసన్నల్లో నడుస్తున్న పాకిస్తాన్ ఇలా మాట్లాడటమా అని రగిలిపోయింది. అప్పటికే అమెరికా రంగంలోకి దిగిన అంశం గురించి తెలుసుకున్న కారణంగానే ఇమ్రాన్‌ఖాన్ ఇలా బహిరంగంగా స్పందించారన్నది స్పష్టం.

పాక్-అమెరికా అధికారులు సమావేశమైన నెల రోజుల తరువాత ఖాన్ ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు, పదవి నుంచి తప్పించారు. అప్పటి నుంచి కొద్ది రోజుల్లోనే పాక్ విదేశాంగ వైఖరి మారిపోయింది. ఉక్రెయిన్ వివాదంలో అమెరికా, ఐరోపా పక్షాన చేరింది. అంతే కాదు, ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధాలు, మందుగుండును తయారు చేసి పంపుతున్నది. ఆగస్టు మూడవ తేదీన వచ్చిన వార్తల ప్రకారం అమెరికాతో పాకిస్తాన్ ఒక రక్షణ ఒప్పందాన్ని కూడా కుదుర్చుకుంది. దాని ప్రకారం సంయుక్త మిలిటరీ విన్యాసాలు, శిక్షణ, మిలిటరీ పరికరాల సహకారం ఉంటుంది. గత ఏడాది ఏప్రిల్ పదిన ఇమ్రాన్ ఖాన్ పదవి కోల్పోయారు. అప్పటి వరకు 2018 నుంచి ఉన్న నిషేధాన్ని సడలించి అదే ఏడాది సెప్టెంబరు నెలలో 45 కోట్ల డాలర్లతో పాకిస్తాన్ వద్ద ఉన్న (అమెరికా గతంలో అమ్మిన) ఎఫ్-16 యుద్ధ విమానాలను నవీకరించేందుకు అమెరికా ఒప్పందం చేసుకుంది. దానికి ఉగ్రవాదం మీద పోరుకు సిద్ధంగా ఉండేందుకు అని సాకు చెప్పారు. నిజానికి ఉగ్రవాదుల మీద విమానాలతో దాడి చేసి నిర్మూలించిన చరిత్ర పాకిస్తాన్‌కు గానీ అమెరికాకు గానీ లేదు.

ఇక పాక్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం గురించి చూస్తే ఇమ్రాన్ ఖాన్ మీద ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గితే అంతకు ముందు ఖాన్‌కు మద్దతు ఇచ్చిన వారందరినీ క్షమించి వేస్తామని అమెరికా అధికారి చెప్పినట్లు పాక్ రాయబారి పంపిన వర్తమానంలో ఉంది. అవిశ్వాస తీర్మాన సమయానికే పాక్ మిలిటరీతో అధికార పార్టీ వివాదంలో ఉంది. పాక్ రాయబారి అసాద్ మజీద్ ఖాన్‌తో జరిపిన సమావేశానికి దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల అమెరికా సహాయ మంత్రి డోనాల్డ్ లు, మరో అధికారి వచ్చారు. ఆ సమావేశంలో డోనాల్డ్ లు మాటల సారం ఇలా ఉంది. ఉక్రెయిన్ అంశంలో పాక్ వైఖరి అమెరికా, ఐరోపాకు ఆందోళనకరంగా ఉంది. తటస్థం అని చెప్పుకోవచ్చుగాని అలా కనిపించటం లేదు. ప్రధాని మీద అవిశ్వాస తీర్మానం నెగ్గితే రష్యా పర్యటనను కేవలం ప్రధాని తీసుకున్న నిర్ణయంగా పరిగణించి మిగతా అందరినీ అమెరికా క్షమించి వేస్తుంది. లేకుంటే గట్టిగా వ్యవహరించాల్సి వస్తుంది. ఐరోపా దీన్ని ఎలా చూస్తుందో చెప్పలేము, నేననుకోవటం వారి స్పందన కూడా ఇలాగే ఉంటుంది. ఖాన్ గనుక అధికారంలో గనుక కొనసాగితే ఐరోపా, అమెరికా అతన్ని ఒంటరిపాటు చేస్తాయి. అమెరికా అధికారి మాట్లాడిన దాని మీద పాక్ రాయబారి స్పందన సారం ఇలా ఉంది. అమెరికా నేతల నుంచి ఎలాంటి స్పందన, సంప్రదింపులు లేవు. దీన్ని బట్టి మారు మాట్లాడకుండా మీకు అవసరమైన వాటన్నింటికీ పాకిస్తాన్ మద్దతు పలుకుతుందనే భావనలో మీరున్నట్లు, మమ్మల్ని ఖాతరు చేయటం లేదని మావారు అనుకున్నారు. ఉక్రెయిన్-రష్యా పోరు మన సంబంధాల మీద ప్రభావం చూపదు. దీని మీద లూ మాట్లాడుతూ మీరు అనుకుంటే అనుకున్నారు కొంత నష్టం జరిగినా అదేమీ పెద్దది కాదులే. ఖాన్‌ను సాగనంపిన తరువాత మన సంబంధాలు తిరిగి మామూలు స్థితికి చేరతాయి. ఇప్పటికే కొంత దెబ్బ తగిలింది. కొద్ది రోజుల్లో మీ దేశ రాజకీయ పరిస్థితి మారుతుందో లేదో చూద్దాం. మారితే ఈ సమస్య గురించి మాకు పెద్ద విభేదాలేమీ ఉండవు, లేదో దీని సంగతి తేల్చుకోవాల్సి ఉంటుంది, ఎలా అదుపులోకి తేవాలో నిర్ణయిస్తాం అన్నాడు. ఈ సమావేశం జరిగిన తరువాత మార్చి ఎనిమిదవ తేదీన అవిశ్వాస తీర్మానం పెట్టారు. నెల రోజుల తరువాత అమెరికా జోక్యం గురించి ఇమ్రాన్ ఖాన్ బహిరంగంగానే తన మద్దతుదారులతో సభలో చెప్పాడు. అయితే తమ జోక్యం అన్నది ఆరోపణ తప్ప వాస్తవం కాదని అమెరికా ఖండించింది.

పాక్ రాయబారి పంపిన వర్తమానం గురించి అనధికారికంగా వెల్లడి కావటంతో పత్రికల్లో చర్చ మొదలైంది. ఇమ్రాన్ ఖాన్‌కు జనంలో ఆదరణ పెరిగింది, అమెరికా, ఐరోపా వ్యతిరేకత కనిపించింది. దాంతో మిలిటరీ రంగంలోకి దిగింది. అధికారిక రహస్యాలను వెల్లడించినా, ప్రచురించినా, మిలిటరీని విమర్శించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, ఎలాంటి వారంట్లు లేకుండానే తనిఖీలు చేస్తామని, దీర్ఘకాల జైలు శిక్షలుంటాయని, రాజకీయ, పౌర అంశాల్లో మిలిటరీ అధికారులకు అపరిమిత అధికారాలను ఇస్తున్నట్లు హెచ్చరికలను జారీ చేసింది. ఇమ్రాన్ ఖాన్‌కు మద్దతుగా రాసినా, చివరికి అతని పేరును పదే పదే ప్రస్తావించినా సంగతి తేలుస్తామని మీడియా సంస్థలకు వర్తమానాలు పంపినట్లు వార్తలు వచ్చాయి. అంతేకాదు ఖాన్ మద్దతుదారుగా భావిస్తున్న ఒక ప్రముఖ జర్నలిస్టు అర్షాద్ షరీఫ్ ఈ ఆంక్షలతో దేశం విడిచి వెళ్లాడు. అక్టోబరు నెలలో నైరోబీలో అతన్ని కాల్చి చంపారు. ఎలా, ఎందుకు జరిగిందో ఇంతవరకు వెల్లడి కాలేదు. మరో జర్నలిస్టు ఇమ్రాన్ రియాజ్ ఖాన్‌ను మే నెలలో ఒక విమానాశ్రయంలో అరెస్టు చేశారు. అతని ఆచూకీ ఇంతవరకు వెల్లడి కాలేదు. గతేడాది నవంబరులో అసలు ఇమ్రాన్ ఖాన్ మీదనే జరిగిన హత్యాయత్నంలో ఒక మద్దతుదారు మరణించిన సంగతి తెలిసిందే.

పాక్ రాయబారి వర్తమానంలో మన దేశం గురించి కూడా అమెరికా-పాక్ మధ్య జరిగిన సంభాషణల్లో కొన్ని అంశాలు చోటు చేసుకున్నాయి. పాక్ రాయబారి డోనాల్డ్ లూ తో దీని గురించి మాట్లాడిన అంశాలు ఇలా ఉన్నాయి. అమెరికా-భారత్ సంబంధాల గురించి సెనెట్ సబ్ కమిటీ సమావేశంలో మీరు మాట్లాడిన తీరు చూస్తే భారత్, పాకిస్తాన్ పట్ల భిన్న ప్రాతిపదికలను అనుసరిస్తున్నట్లు ఉంది. భద్రతా మండలి, ఐరాస సమావేశానికి భారత్ గైర్హాజరు గురించి ఈ వైఖరి స్పష్టంగా కనిపించింది. వారి పట్ల ఒక వైఖరి మా పట్ల మరో వైఖరి ఎందుకు? భారత్ కంటే మా నుంచి మీరు ఎక్కువ ఆశిస్తున్నట్లు, ఎక్కువ ఆందోళన చెందినట్లు కనిపిస్తోంది. దీని మీద డోనాల్డ్ స్పందిస్తూ చైనాలో ఏం జరుగుతోందనే దాన్ని బట్టి అమెరికా-భారత్ సంబంధాలు ఉంటాయి. దానితో పాటు మాస్కోతో భారత్‌కు సన్నిహిత బంధం ఉంది. ఉక్రెయిన్ నుంచి భారత విద్యార్థులు వెలుపలికి వచ్చిన తరువాత భారత వైఖరిలో మార్పు ఉంటుందని నేను అనుకుంటున్నాను అన్నాడు. మొత్తం మీద చూస్తే అమెరికా తన అవసరాల కోసం ఎంతకైనా తెగిస్తుందని, ఏ దేశ అంతర్గత వ్యవహారాల్లోనైనా జోక్యం చేసుకుంటుందని పాక్ పరిణామాలు వెల్లడిస్తున్నాయి. వాటి నుంచి మనం పాఠాలు నేర్చుకుంటామా? ★

కవిత్వం

ఒక దేశం - ఒకే పువ్వు

ఎవరో ఒక కొత్త చట్టం తీసుకొచ్చారు
వీచే ముందు గాలులు అనుమతి తీసుకోవాలని
వీచే ముందు గాలులు తమ దిశ దశ ఏమిటో ఎటో
వివరాలు తెలయజేయాలని ఎవరో కొత్త చట్టం తెచ్చారు
గాలులు ఎంత వేగంగా వీచాలనుకున్నాయో
అవి ఎంత వేగంగా వీచాలనుకున్నాయో
వివరాలు సమర్పించనిదే అనుమతి దొరకదని
ఎవరో కొత్త చట్టం తెచ్చారు
ఇప్పుడిక్కడ సుడిగాలులకు అనుమతి లేదు
మేం కడుతున్న ఆ పేక మేడల్ని
సంరక్షించాల్సిన బాధ్యత మాపై ఉంది
అందువల్ల ఈ చట్టాలు
సత్వరమే అమల్లోకొస్తున్నాయి!
తమ చట్టాలకు అనుగుణంగా
ఎవరో ఇక్కడ కొత్త చట్టాలు తెచ్చారు
ఒడ్డును తాకే కెరటాలక్కూడా ఒక హెచ్చరిక!
ఎగిసెగిసి పడడం మళ్ళీ తిరిగి వెళ్ళడం
బలం పుంజుకుని మళ్ళీ నీటి పిడికిళ్ళతో తిరిగి రావడం
ఇవన్నీ ఇప్పుడిక కుదరదు
తిరుగుబాట్లు, ఉద్యమాలు, హోరెత్తి పోవడాలు నిషిద్ధం
ఎంతటి ఉధృతి ఉన్నా బుద్ధిగా ఒడ్డులోపల మాత్రమే
నిశ్శబ్దంగా ప్రవహించాల్సి ఉంటుంది!
తోటలోని మొక్కలన్నీ ఒకే విధంగా పూయాలని
పూచే పూలరంగు కూడా ఒకటిగానే ఉండాలని
కొత్త చట్టం అమలులో కొచ్చింది
ఒకే రంగు మాత్రమే కాదు
ఏ పువ్వు రంగు ఎంత గాఢంగా ఉండాలో కూడా
వారు నియమించిన వారి అధికారులే నిర్ణయిస్తారట?
ఒక దేశం - ఒకే పువ్వు !!
ఈ చట్టాలు చేసిన గౌరవనీయులకు ఎవడు చెప్పాలి?
తోటలో అన్ని మొక్కల పూలు ఒకే రకంగా ఉండవని
పూలన్నీ ఒకే రంగులో అసలే ఉండవని
ఉండడానికి వీలే లేదని
ఒక రంగులో అనేక రంగులుంటాయని కూడా
వారికి ఎవడు చెప్పాలి?
గాలులు, కెరటాలు ఎవరి చట్టాలకూ లొంగవనీ
గాలి ఎవరి పిడికిలిలోనో ఖైదీగా ఉండదని
కెరటం ఎవరి జీవోలతోనో వెనక్కి మళ్ళదని
ఎంతటి వారైనా సరే, వాటిని గమనిస్తూ
వాటికి అనుగుణంగా బతకాల్సిందే తప్ప
మరో మార్గం లేదని!
లేకపోతే, అవి సృష్టించే సునామీలో
అడ్రసు లేకుండా గల్లంతు కావాల్సిందేనని
నామరూపాలు లేకుండా నశించాల్సిందేనని
వారికి ఎవరైనా చెప్పండి!
కనీస గౌరవమైనా.. కాపాడుకొమ్మని!!

- డా॥ దేవరాజు మహారాజు

సమస్య

యుసిసి - వికలాంగులపై ప్రభావం



యం. అడివయ్య



వ్యక్తిగత చట్టాలను సంస్కరించాలనుకున్నప్పుడు లేదా దాని కోసం ఏదైనా చట్టం చేయాలనుకున్నప్పుడు ప్రజలతో విస్తృత సంప్రదింపులు జరపాలి. యుఎన్‌సిఆర్‌పిడి నిబంధనలకు అనుగుణంగా దేశంలో ఉన్న చట్టాలను మార్చాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 15(1), 15(2), 15(4), 16(2)లను వికలాంగుల పట్ల వివక్షను నిషేధించే విధంగా సవరణ చేయాలి. వికలాంగుల పట్ల వివక్షను నిషేధిస్తున్న ఆర్‌పిడబ్ల్యుడి చట్టం-2016 లోని సెక్షన్ 3(3)ని అమలు చేయాలి.

ఒకే దేశం, ఒకే చట్టం పేరుతో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఏకరూప పౌరస్మృతిని (యుసిసి) తీసుకురావాలని చూస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న యుసిసి పరిధిలోకి ఈ కింది అంశాలు వస్తున్నాయి. వివాహ వ్యవస్థ - నిబంధనలు (భార్య, పిల్లలు), దత్తత, సంరక్షణ, వారసత్వం వ్యవస్థ, ఆస్తి హక్కు, ట్రస్ట్/బహుమతులు/ఎండోమెంట్స్, గిరిజన ప్రజలకు సంబంధిత ఆస్తులు, స్థానిక పంచాయతీల నిర్వహణలో ఉన్నటువంటి అటవీ భూములు, పోరంబోకు భూములు, కమ్యూనిటీ ఆస్తులు వంటివి సామూహికంగా ప్రజల అవసరాల కోసం వినియోగించడం జరుగుతుంది. వీటిని వికలాంగులతో సహా ప్రజలందరూ వినియోగించుకుంటున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం యుసిసి అమలు చేయాలనే లక్ష్యంలో భాగంగా ఈ చట్టాలను మార్చినట్లయితే వికలాంగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రభావితం అవుతారు. ఎందుకంటే వికలాంగులు, పిల్లలు, భార్యాభర్తలు, తోబుట్టువులు, తల్లిదండ్రులు, తాతముత్తాతలు, మేనమామలు, కుటుంబ సభ్యులకు దూరంగా జీవిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. సమాజంలో సభ్యులుగా ఉన్నప్పటికీ వీరు భిన్నమైన జీవితాన్ని కొనసాగిస్తున్నారు. తమ జీవిత కాలంలో వయస్సు, లింగం, కుల, మతపరమైన గుర్తింపులకు నోచుకోరు. ఈ నేపథ్యంలో సమాజంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అవసరాలు తీరే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలి.

హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులకు తమ మతాలకు అనుగుణంగా అనేక చట్టాలున్నాయి. ముస్లిం, క్రిస్టియన్లు వేర్వేరు చట్టాలు ఉన్నాయి. దేశంలో పెళ్లి, విడాకులు, వారసత్వ అస్తి, దత్తత వంటి అంశాల్లో చట్టాలు ఒకేలా లేవు. హిందూ మతంలో భార్య లేదా భర్త చనిపోతే రెండో వివాహం చేసుకునేందుకు గోవా పౌరస్మృతి అనుమతిస్తుంది. ఇతర మతాల్లో ఇలాంటి అవకాశం లేదు.

సమాజ, కుటుంబ, సామాజిక రంగాలలో అనేక రకాలుగా వికలాంగులు అవమానాలు, అన్యాయాలు, వివక్షత, దోపిడీలకు గురవుతున్నరు. కుటుంబ సభ్యులు తలిదండ్రుల నుండి వికలాంగులకు వారసత్వంగా వస్తున్న ఆస్తిలో వారి వాటాను ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సమాజంలో నేడు వికలాంగులకు కుటుంబ సభ్యులు కనీస రక్షణ కల్పించే పరిస్థితి లేదు. వికలాంగులకు భద్రత కల్పించాలనే కనీస ఆలోచన లేకపోవడం వలన వారసత్వంగా వచ్చే ఆస్తిని సైతం పొందలేకపోతున్నారు. కుటుంబం నుండే అవమానాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నేడు సమాజంలో ఉంది.

ఇప్పటికే దేశంలో అమలులో ఉన్న చట్టాలు వికలాంగులకు కొన్ని అంశాల్లో ప్రయోజనాలు కల్పిస్తున్నాయి. కానీ కుటుంబంలోని ఇతర సభ్యులతో సమాన అవకాశాలు పొందే అవకాశం ఉండాలి. ఉదాహరణకు, ముస్లిం చట్టం ప్రకారం కూడా వికలాంగులు పుట్టుక, వివాహం, రక్తసంబంధం ద్వారా వారసత్వంగా పొందుతారు. వారి వాటా ఇతర వారసులతో సమానంగా ఉండాలి. వికలాంగుల హక్కుల చట్టం-2016, మానసిక ఆరోగ్య చట్టం-2017 ఆమోదించి అందించిన విధంగా, వికలాంగుల జీవితాలకు సంబంధించిన చట్టపరమైన అంశాలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

వికలాంగులకు సంబంధించి వ్యక్తిగత చట్టాలతో పాటు, ఇతర పౌర చట్టాలు, పథకాల అమలుపై యుసిసి ప్రభావం ఉంటుంది. ఐక్యరాజ్యసమితి హక్కుల ఒప్పందాన్ని భారత ప్రభుత్వం 2007లో ఆమోదించింది. దీనికి అనుగుణంగానే 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్-2017 చట్టాలు అమలులోకి వచ్చాయి. ఈ చట్టాలు వికలాంగులకు సంబంధించి ఇల్లు, కుటుంబం, ఆస్తిపై హక్కును పునరుద్ఘాటిస్తున్నాయి. నేషనల్ ట్రస్ట్ ఫర్ ది వెల్ఫేర్ ఆఫ్ పర్సన్స్ ఆఫ్ ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, మెంటల్ రిటార్డేషన్ మరియు మల్టిపుల్ డిజెబిలిటీస్ యాక్ట్ 2000...వంటి చట్టాలు కూడా వికలాంగులకు సంక్షేమం కోసం కృషి చేస్తున్నాయి. వికలాంగులతో సహా అందరూ సమాజంలో ఇవ్వబడిన హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి.

వ్యక్తిగత న్యాయ విధానాలు వికలాంగులకు కొన్ని రక్షణలను అందిస్తున్నాయి. ఆచార, వ్యక్తిగత చట్టాలలోని ఈ రక్షణలు మరింత పటిష్ఠంగా ఉంటే, వికలాంగులతో పాటు ప్రజలందరూ న్యాయం పొందడం సులభం అవుతుంది. గతంలో బాల్యవివాహాలు, సతీసహగమనం వంటి దురాచారాలను నిర్మూలించేందుకు ప్రభుత్వాలు కృషి చేసినప్పటికీ, సతీసహగమనం పోవడానికి దాదాపు ఒక శతాబ్దం పట్టింది. బాల్య వివాహాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అటువంటి సందర్భంలో వికలాంగులైన మైనరులను వారి ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకుంటే న్యాయం పొందడం చాలా కష్టం. హిందూ చట్టానికి 2005లో సవరణ చేసి కుమార్తెలకు కోపర్సనరీ హక్కులను కల్పించింది. ఇది మహిళలు తమ హక్కులను పొందేందుకు ఒక మార్గాన్ని అందించింది.

వ్యక్తిగత చట్టాలను సంస్కరించాలనుకున్నప్పుడు, దాని కోసం ఏదైనా చట్టం చేయాలనుకున్నప్పుడు ప్రజలతో విస్తృత సంప్రదింపులు జరపాలి. యుఎన్‌సిఆర్‌పిడి నిబంధనలకు అనుగుణంగా దేశంలోని చట్టాలను మార్చాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 15(1), 15(2), 15(4), 16(2)లను వికలాంగుల పట్ల వివక్షను నిషేధించే విధంగా సవరణ చేయాలి. వికలాంగుల పట్ల వివక్షను నిషేధిస్తున్న ఆర్‌పిడబ్ల్యుడి చట్టం-2016 లోని సెక్షన్ 3(3)ని అమలు చేయాలి. వికలాంగులు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించే చట్టాలను (మున్సిపల్/ పంచాయతీ/ సహకార సంఘాలు) రద్దు లేదా సవరణ చేయాలి. దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు, కుటుంబ చట్టాలకు మధ్య ఉన్న ఘర్షణను తొలగించకుండా ఏకరూప పౌరస్మృతిని తీసుకువచ్చి అమలు చేయడం ఆచరణ సాధ్యం కాదు.

/వ్యాసకర్త ఎన్‌పిఆర్‌డి జాతీయ ఉపాధ్యక్షులు,
సెల్ : 9490099713 /

జనవాక్యం

ధరిత్రి వ్యధ

నా పేరు 'ధరణి' - నాకెన్నో పేర్లు వున్నాయిలే ! సమస్త కోటి జీవరాశికి పునాదిని, సకల సంపదలను దాచుకున్న 'ధరిత్రి'ని. నిత్యం నాకు నేనే భ్రమిస్తూ, పరిభ్రమిస్తూ కాలాన్ని నిర్దేశిస్తూ పుట్టుట, గిట్టుట లకు అనాదిగా మట్టిగా మానవాళి తమ మనుగడ కోసం రకరకాల రవాణా సాధనాల్ని మోపుతుంటే బరువైనా మోస్తున్న 'వసుమతి'ని! ఆకాశ హర్మ్యాల పేరిట పునాదుల కోసం గునపాలతో మరింత లోతుకు గుచ్చుతున్నా, మెట్రో పేరిట పిల్లర్ల కోసం అదనంగా దించుతున్నా దాహార్తి కోసం ఒకరిని మించి మరొకరు వందలాది అడుగుల లోతుకు తూట్లు పొడుస్తున్నా-మౌనంగా భరిస్తున్న 'వసుధ'ని! ఆధునికత పేరుతో సహజ ఎరువులు వదిలేసి - వివిధ రసాయనాలను వొదులుతూ కలుషితం చేస్తున్నా అది మానవాళి ఆరోగ్యాలకే కదా ముప్పు అని ఆలోచిస్తున్న భువిని, భూదేవిని! రకరకాల వ్యర్థాలతో కాలుష్యం నింపుతున్నా చేసేదిలేక కాదనకుండా భరిస్తున్న 'మేదిని'ని! ఖనిజ సంపద కోసం డొల్ల చేస్తూ ఖతం చేస్తున్నాకొండల్ని, బండల్ని కూడా వదలకుండా పిప్పి చేస్తున్నా నాగరికత పేరుతో నా వక్ష సంపదని నరికేస్తున్నా, దోచేస్తున్నామారు మాటాడకుండా చోద్యం చూస్తున్న 'పుడమి'ని! ఈ దాడులన్నిటికి తట్టుకోలేక ఎప్పుడైనా గజగజ వణికినా ఆ ప్రకంపనలకు ప్రాణాలు చెల్లాచెదురైనా - కారణం నేనే అని దూషించినా వాళ్ళ అవివేకానికి దీనంగా చూస్తున్న 'అవని'ని! పంచభూతాల కలుషితంతో ఆకాశంలో మాయమవుతున్న తారల్ని చూస్తే అర్థం అవట్లేదా! వినాశనానికి మరెంతో దూరం లేదని మరెప్పుడు తెలుసుకుంటుంది ఈ మానవాళి మరో తరానికి 'భవిష్యత్తు' ఏమిస్తుంది?

- న్యాలకంటి నారాయణ
సెల్ : 9550833490

తూర్పు లడఖ్‌సహా వివాదాల పరిష్కారానికి

భారత్-చైనా అంగీకారం

న్యూఢిల్లీ : తూర్పు లడఖ్‌లోని వాస్తవ ఆధీన రేఖ (ఎల్‌ఎసి) వెంట మిగిలిన ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించుకోవడానికి భారత్-చైనా ఒక అంగీకారానికి వచ్చాయి. ఈ మేరకు ఇరు దేశాలు మంగళవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. రెండు దేశాల మధ్య ఈ నెల 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు సైనిక చర్చలు జరిగాయి. 19వ రౌండ్ కార్ప్స్ కమాండర్ స్థాయి సమావేశం భారత్ వైపు ఉన్న చుషుల్-మోల్డో వద్ద జరిగింది. ఈ సమావేశంలో 'తమ నాయకత్వాలు అందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చర్చలు జరిగాయి' అని సంయుక్త ప్రకటన తెలిపింది. సైనిక, దౌత్య మార్గాల ద్వారా మిగిలిన సమస్యలను వేగంగా పరిష్కరించుకోవడానికి ఒక అంగీకారానికి వచ్చారు. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతను కొనసాగించడానికి ఇరు పక్షాలు అంగీకరించినట్లు ప్రకటన తెలిపింది. తూర్పు లఢక్‌లో అనేక ప్రాంతాల్లో ఇరు దేశాలు తమ బలగాల ఉపసంహరణను పూర్తి చేసినప్పటికీ, కొన్ని సమస్యాత్మక పాయింట్లల్లో బలగాలను రెండు దేశాలు మోహరించి ఉంచాయి.

సుదీర్ఘ ప్రసంగాలు చేస్తే భారతదేశం విశ్వగురువు కాదు..

- మోడీకి ఢిల్లీ సిఎం కౌంటర్



న్యూఢిల్లీ: కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. భారతదేశం "విశ్వగురువు"గా మారాలంటే ప్రజలు సామరస్యంగా జీవించాలని.. మంచి విద్య, వైద్య సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరాకు హామీ ఇవ్వాలని ఆయన అన్నారు. 77వ స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా కేజ్రీవాల్ ఛత్రసాల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ మండుతోందని ఒక సోదరుడు, మరో సోదరుడితో గొడవపడుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో అంతర్గత విభేదాలు చెలరేగుతున్నప్పుడు భారతదేశం ప్రపంచ నాయకుడిగా, విశ్వగురువు ఎలా అవుతుందని ప్రశ్నించారు. హర్యానాలోని బిజెపి ప్రభుత్వం నుహ్‌లో హింసకు కారణమని కేజ్రీవాల్ విమర్శించారు. దేశంలోని వారు ఒకరితో మరొకరు పోరాడుతుంటే, భారతదేశం విశ్వగురువు ఎలా అవుతుందని ప్రశ్నించారు. సుదీర్ఘ ప్రసంగాలు చేయడం ద్వారా భారతదేశం ప్రపంచ అగ్రగామి అవుతుందా? అని అన్నారు.

పిఎఫ్ఐ సభ్యుల బెయిల్ పిటీషన్లపై స్పందించండి

- ఇడికి ఢిల్లీ కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ)కు చెందిన ముగ్గురు సభ్యులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై స్పందించాలని ఇడిని మంగళవారం ఢిల్లీలోని ఒక కోర్టు ఆదేశించింది. ఈ ముగ్గురు తీవ్రవాద కార్యక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యారు. మహమ్మద్ ఇలియాస్, మహమ్మద్ పర్వేజ్ అహ్మద్, అబ్దుల్ ముకీత్ బెయిల్ పిటిషన్లపై స్పందించాలని ప్రత్యేక జడ్జి శైలేందర్ మాలిక్ ఇడికి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 26లోగా స్పందన తెలియజేయాలని ఆదేశించారు. గత ఏడాది సెప్టెంబరు 22న అరెస్టయిన వీరు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. కొన్నేళ్ల నుంచి రూ.120 కోట్ల మనీలాండరింగ్ జరిగిందని ఇడి కేసు నమోదు చేసింది. ఎన్ఐఎ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి కేసు నమోదు చేసింది. వీరికి వ్యతిరేకంగా గత ఏడాది నవంబర్ 19న ఇడి చార్జిషీట్ దాఖలు చేసింది. గత ఏడాది సెప్టెంబర్‌లో పిఎఫ్ఐపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే.

లౌకిక గణతంత్ర పరిరక్షణకు

పోరాటం మరింత బలోపేతం

జాతీయ జెండాను ఎగరవేసిన అనంతరం సీతారాం ఏచూరి



ఎకెజి భవన్‌లో జాతీయ పతాకావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర విధానాలను కాపాడుకునేందుకు పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్)లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీతారాం ఏచూరి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని మత రాజ్యంగా మార్చాలనుకునేవారు నేడు పాలిస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలోనూ ఈ మతతత్వ శక్తులు భారత్‌ను మత రాజ్యంగా మార్చాలని చూశాయని, అయితే, సుదీర్ఘ సైద్ధాంతిక పోరాటం తరువాత స్వతంత్ర భారతదేశం లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ప్రకటించబడిందని ఏచూరి తెలిపారు. మోడీ ప్రభుత్వం మతతత్వ ఎజెండాను దూకుడుగా అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. ద్వేషపూరిత ప్రచారంతో అల్లర్లు చెలరేగుతున్నాయని, మణిపూర్, హర్యానాలో మత చిచ్చు ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. దేశాన్ని ప్రభావితం చేసే అంశాలను గౌరవించకుండా స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోడీ రాజకీయ ప్రసంగం చేశారని ఆయన విమర్శించారు. ఐదు ప్రధాన కుంభకోణాలను కాగ్ నివేదిక స్పష్టంగా ఎత్తి చూపినా, వీటిని పార్లమెంట్‌లో చర్చకు రానీయ కుండా మోడీ ప్రభుత్వం అడ్డుకున్నారు.. కొన్ని కీలకమైన బిల్లులు సైతం ఎలాంటి చర్చ లేకుండా హడావుడిగా పార్లమెంటులో ఆమోదింపజేసుకు న్నారని ఏచూరి విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, తపన్ సేన్, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. తమిళనాడు రాజధాని చెన్నైలోని సిపిఎం రాష్ట్ర కమిటీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు జి రామకృష్ణన్ ఇతర నాయకులు పాల్గొన్నారు. కేరళలోని తిరువనంతపురంలో ఎకెజి కేంద్రంలో జాతీయ జెండాను సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ ఎగురవేశారు. కేంద్ర కమిటీ సభ్యులు ఎకె బాలన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ట్రంప్‌పై నేరాభియోగాలు నమోదు

వాషింగ్టన్ డిసి : అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై నేరాభియోగాలు నమోదయ్యాయి. 2020 దేశాధ్యక్ష ఎన్నికల్లో జార్జియా రాష్ట్ర ఫలితాలను తారుమారు చేసేందుకు ట్రంప్ ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత కొన్ని నెలల్లో ట్రంప్‌పై నమోదైన నాలుగో క్రిమినల్ కేసు ఇది. రాబోయే అధ్యక్ష ఎన్నికలపై కన్నేసిన రిపబ్లికన్ నేత ట్రంప్‌తో పాటు మరో 18 మందిపై తాజా కేసులో నేరాభియోగాలు నమోదయ్యాయి. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడినట్లు, అనవసరంగా జోక్యం చేసుకున్నట్లు నమోదైన 13 అభియోగాలను ట్రంప్ ఖండించారు. రాజకీయ కక్షతో ఆ ఆరోపణలు చేసినట్లు ఆయన తెలిపారు. జార్జియా ప్రాసిక్యూటర్ ఫాని విల్లిస్ తన తీర్పును వెలువరించారు. ఆ రాష్ట్ర ఎన్నికల్లో జోక్యం చేసుకున్న అంశంపై 2021 ఫిబ్రవరిలో ఆమె దర్యాప్తు మొదలుపెట్టారు. దీనిపై 98 పేజీల రిపోర్టును ఆమె తయారు చేశారు. సోమవారం ఆ తీర్పును ప్రకటించారు. ఆగస్టు 25వ తేదీలోగా సరెండర్ కావాలని, లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆమె హెచ్చరించారు. జార్జియా ఎన్నికల అధికారితో ట్రంప్ మాట్లాడినట్లు ఓ ఫోన్ కాల్ రికార్డు లీకైంది. తనకు మరో 11,780 ఓట్లు కావాలని, ఆ ఓట్లు దక్కేలా ఎలాగైనా చూడాలని జార్జియా అధికారిని ట్రంప్ కోరినట్లు ఆ రికార్డులో సంభాషణ ఉన్నది. ఆ ఫోన్ రికార్డు కారణంగానే జార్జియా కేసులో ప్రాసిక్యూటర్ విచారణ చేపట్టారు. కీలకమైన ఆ రాష్ట్రంలో రిపబ్లికన్ పార్టీ గెలుస్తుందని ఆశించినా.. చివరకు డెమొక్రటిక్ పార్టీ ఆ రాష్ట్రాన్ని కైవసం చేసుకుంది.

జెండావందనం రోజు అపశృతి..

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని రైసేన్ జిల్లాలోని హోంగార్డు ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. జెండాను ఎగురవేసిన అనంతరం ఆ రాష్ట్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ ప్రభురామ్ చౌధరి ఉన్నట్టుండి స్పృహతప్పి స్టేజిమీదే పడిపోయారు. పక్కనే ఉన్న అధికారులు ఆయనను పట్టుకున్నారు. అనంతరం చికిత్స నిమిత్తం భోపాల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. మంత్రికి అధిక రక్తపోటు, షుగర్ లెవల్స్ కారణంగా అలా జరిగి ఉండొచ్చని ఈ కార్యక్రమానికి హాజరైన వైద్యులు తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గిరీష్ గౌతమ్ కూడా స్పీచ్ ఇచ్చే క్రమంలో కుప్పకూలారు. ఆయనను ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందిస్తున్నారు.



భారీ వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న ఆఫ్తర్‌మత్ నది

హిమాచల్‌లో 53కు పెరిగిన మృతులు

షిమ్లా : హిమాచల్‌ప్రదేశ్‌లో భారీ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య మంగళవారానికి 53కు చేరుకుంది. రాజధాని సిమ్లాలో సోమవారం ఒక గుడిపై కొండచరియలు విరిగిపడిన ఘటనలో మంగళవారం మరో ఇద్దరి మృతదేహాలను వెలికితీసారు. ఈ ప్రాంతంలో మొత్తంగా 11 మృతదేహాలను గుర్తించారు. సిమ్లాలోనే ఫగ్లి ప్రాంతంలోనూ సోమవారం కొండచరియలు విరిగిపడిన సంగతి తెలిసిందే. ఇక్కడ ఐదుగురు మరణించారు. దీంతో మొత్తంగా సిమ్లాలోనే మరణాల సంఖ్య 16కు చేరుకుంది. వివిధ జిల్లాల్లోనూ కొండచరియలు విరిగిపడటంతో మరో 37 మంది మరణించారు. రాష్ట్రంలో ఆదివారం నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో కొండచరియలు విరిగిపడిన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో, రహదారులను మూసివేశారు. మంగళవారం కూడా పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. హిమాచల్ ప్రదేశ్ యూనివర్శిటీకి ఈ నెల 18 వరకూ సెలవులు ప్రకటించారు. యూనివర్శిటీ లైబ్రరీని ఈ నెల 20 వరకూ మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

త్రిపుర తేయాకు తోటల కార్మిక నేత

పను మజుందార్ కన్నుమూత

- సిఐటియు సంతాపం

న్యూఢిల్లీ : త్రిపుర ప్రజల కోసం, కార్మిక వర్గ ఉద్యమాల కోసం తన జీవితాంతం విశేషంగా కృషి చేసిన తేయాకు తోటల కార్మిక నేత పను మజుందార్ సోమవారం అర్ధరాత్రి సమయంలో త్రిపురలోని జిబిపి ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆయన వయస్సు 86 సంవత్సరాలు. పను మజుందార్‌గా అందరికీ చిరపరిచితులైన ఆయన పేరు సుధామోయి మజుందార్. 1970ల నుంచి ఆయన తేయాకు తోటల కార్మికుల సంక్షేమం కోసం పాటు పడ్డారు. వారందరినీ సంఘటితం చేసేందుకు ఎంతగానో కృషి చేశారు. త్రిపుర రాష్ట్ర సిఐటియు ఏర్పాటు కాలం నుండి ఆయన కీలక నిర్వాహకుడి పాత్ర పోషించారు. కార్మిక వర్గ విముక్తి ప్రయోజనాల కోసమే ఆయన తన జీవితాన్ని ధారబోశారు. ఆయన పెళ్లి చేసుకోలేదు. మొత్తంగా తన జీవితాన్ని తేయాకు తోటల కార్మికులకే అంకితం చేశారు.



సిఐటియు సంతాపం

ఆయన మృతికి సిఐటియు ఘనంగా నివాళు లర్పించింది. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటన జారీ చేస్తూ, తను ఎంతగానో ప్రేమించి, అభిమానించే కార్మిక సోదరులను విడిచి మజుందార్ వెళ్లిపోయారని పేర్కొన్నారు. తేయాకు తోటల కార్మికుల హక్కుల కోసం, వారికి మరింత మెరుగైన జీవనోపాధుల కోసం కృషి చేసే సమయంలో ఆయన ఎన్నో సవాళ్ళు ఎదుర్కొన్నారని, ముఖ్యంగా లాకౌట్‌లు, ఫ్యాక్టరీల మూసివేతలు వంటి సమస్యలు కార్మికులను వెంటాడేవని తపన్‌సేన్ పేర్కొన్నారు. అటువంటి సందర్భమే దుర్గాబారి టీ గార్డెన్ క్రిమినల్ ప్రొప్రయిటర్ విషయంలో చోటు చేసుకుంది. వందలాదిమంది కార్మికులు విషమ పరిస్థితుల్లో మరణించేలా తేయాకు తోటను ఖాయిలా పడేలా చేసి వదిలివేయడంతో ఆ తోట కార్మికులందరినీ ఒక్క తాటిపైకి తీసుకువచ్చిన మజుందార్ వారికి మార్గనిర్దేశనం చేసి, దాన్నొక సహకార తేయాకు తోటగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని తపన్‌సేన్ గుర్తు చేసుకున్నారు. చెక్కుచెదరని స్ఫూర్తి, విజ్ఞానం, కఠోర శ్రమ, సోదర భావనలు, భాగస్వామ్య నమూనాతో కూడిన పటిష్టమైన నాయకత్వంతో దుర్గాబారిని సహకార తేయాకు తోటకు అంతర్జాతీయ నమూనాగా మార్చారు. అక్కడ నుండి నిలకడగా అధిక దిగుబడులు సాధిస్తూ లాభదాయకమైన టీ గార్డెన్‌గా మారింది. ఇప్పటికీ సహకార పద్ధతిలో సాగుతున్న ఆ గార్డెన్ అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ... కార్మికులకు గణనీయమైన లాభాలు అందిస్తోంది.

అఖిల భారత తేయాకు తోట కార్మికుల సమాఖ్య సభ్యుడిగా పను మజుందార్ వున్నారు. దీర్ఘకాలం సిఐటియు అఖిల బారత జనరల్ కౌన్సిల్ సభ్యునిగా వున్నారు. త్రిపుర రాష్ట్ర సిఐటియు కమిటీ ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశారు. క్లిష్టమైన విషయాలను కూడా చాలా సరళంగా వివరించగల అసాధారణ ప్రతిభ ఆయన స్వంతమని తపన్‌సేన్ పేర్కొన్నారు. ఆయన కృషి, త్యాగాలతో దుర్గాబారికి ప్రత్యామ్నాయాన్ని చూపించారని తెలిపారు. భారతదేశంలో కార్మిక భాగస్వామ్య సహకార ఉద్యమ చరిత్రలో దుర్గాబారి ఒక కరదీపికలా నిలుస్తుందని పేర్కొన్నారు.

వచ్చే ఏడాది నుంచి జాతీయ విద్యావిధానం రద్దు

- కర్ణాటక సర్కార్ సంచలన నిర్ణయం

బెంగళూరు: కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది 2024-25 విద్యా సంవత్సరం నుంచి కర్ణాటకలో జాతీయ విద్యా విధానం-2020ని రద్దు చేయనున్నట్లు ప్రకటించింది. మంగళవారం జరిగిన కర్ణాటక కాంగ్రెస్ పార్టీ జనరల్ బాడీ సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ ప్రకటన చేశారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో జాతీయ విద్యావిధానం అమలు నిలిపేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇతర బిజెపి పాలిత రాష్ట్రాల్లో అమలు చేయకుండా జాతీయ విద్యావిధానం-2020ని కర్ణాటకలో మాత్రమే అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. మనువాద భావజాలంతో కూడిన ఈ విద్యావిధానం కంటే రాజ్యాంగం ప్రకారం కర్ణాటకలో విద్యావిధానం అమలవుతుందని సిద్ధరామయ్య తెలిపారు. బిజెపి అధికారంలో ఉండగా.. మనువాద భావజాలంతో విద్యావిధానంలో జరిగిన కాషాయీకరణను సరిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఏడాది రాష్ట్రంలో విద్యా సంవత్సరం మొదలయ్యే సమయంలో ఎన్నికలు జరిగి ఫలితాలు రావడంతో ఈ నిర్ణయం అమలు చేయడం సాధ్యం కాదని సిద్ధరామయ్య తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి జాతీయ విద్యావిధానం అమలు రద్దు నిర్ణయం అమల్లోకి వస్తుందని సిద్ధరామయ్య ప్రకటించారు. రాజ్యాంగానికి అనుగుణంగా విద్యను అందించడానికి ప్రయత్నిస్తామన్నారు. బిజెపి వారు మనువాదాన్ని నమ్ముతారని సిద్ధరామయ్య అన్నారు. ఎన్ఇపిని విద్యార్థులు, తల్లిదండ్రులు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారని చెప్పిన సిద్ధరామయ్య.. ఇతర రాష్ట్రాలు అమలు చేయకముందే కర్ణాటకలో ఎన్ఇపిని అమలు చేయడం ద్వారా బిజెపి విద్యార్థులకు నష్టం చేసిందన్నారు.

ప్రైమరీ బోధనకు బిఇడిలు అర్హులు కాదు : సుప్రీం

న్యూఢిల్లీ : బిఇడి అభ్యర్థులు ప్రాథమిక పాఠశాలల్లో బోధించడానికి అర్హులు కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. చిన్న పిల్లలకు ప్రాథమిక విద్య బోధించడానికి ప్రత్యేక శిక్షణ ఉంటుందని, ఆ శిక్షణ పొందిన వాళ్లే అర్హులని స్పష్టం చేసింది. బిఇడి చదివిన వాళ్లు కూడా ప్రాథమిక తరగతుల బోధనకు అర్హులేనంటూ ఉపాధ్యాయ విద్య జాతీయ మండలి (ఎన్‌సిటిఇ) 2018లో ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. తాజాగా ఆ నోటిఫికేషన్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాజస్థాన్ హైకోర్టు ఇప్పటికే మండలి నోటిఫికేషన్‌ను కొట్టేయగా, కొంతమంది బిఇడి అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు కూడా రాజస్థాన్ హైకోర్టు తీర్పును సమర్థించింది. సుప్రీంకోర్టు తీర్పుతో ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో ప్రాథమిక పాఠశాలల్లో టీచర్ల నియామకాలు వివాదాస్పదం అయ్యే అవకాశం ఉంది.

కుకీ శరణార్థులను నిందించొద్దు

- అమిత్ షాకు మిజోరం ఎంపి కౌంటర్

న్యూఢిల్లీ : సమీప మయన్మార్ నుంచి వలస వచ్చిన 40 వేల మందికి పైగా కుకీ శరణార్థులకు మిజోరం ఆశ్రయం కల్పిస్తుందని, వాళ్లతో ఎలాంటి సమస్యా లేదని ఆ రాష్ట్రానికి చెందిన రాజ్యసభ సభ్యులు కె. వన్లాల్వెనా మంగళవారం ఒక మీడియా సంస్థకు తెలిపారు. మణిపూర్‌లో హింసాకాండకు మయన్మార్ నుంచి వచ్చిన కుకీలే కారణమని గతవారంలో పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు ప్రతిగా ఎంపి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఎంపి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో ఒక భాగస్వామి అయిన మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్)కు చెందిన వారు కావడం విశేషం. ఎన్‌డిఎ కూటమిలోని పార్టీకి చెందిన ఎంపి అయినా వన్లాల్వెనాకు ఇటీవల ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. 'ఈ సమావేశాలు ప్రారంభమైన జులై 20 నుంచి ప్రతిరోజూ నేను మణిపూర్ అంశంపై చర్చకు నోటీసు ఇచ్చేవాడిని. అధ్యక్ష స్థానంలో ఉన్న వారు దానిని అనుమతించేవారు కాదు. కుకీలపై అమిత్ షా విమర్శలు చేసిన తరువాత రోజున, అంటే ఈ నెల 11న నేను మాట్లాడాలని కోరుకున్నాను. కానీ నా మైక్రోఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు' అని ఎంపి చెప్పారు. మే 3 నుంచి మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్రం నుంచి సుమారు 12 వేల మంది మిజోరంలో శరణార్థులుగా ఉంటున్నారని, వీరి పునరావాసం కోసం కేంద్రాన్ని మిజోరం ప్రభుత్వం రూ.10 కోట్ల సహాయం కోరితే రూ.3 కోట్లు మాత్రమే విడుదల చేసిందని చెప్పారు. మణిపూర్ హింసాకాండకు శరణార్థులను నిందించడం సరికాదని ఎంపి విమర్శించారు.

గోద్రా రైలు దహనం కేసులో దోషులకు బెయిలు కుదరదు : సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన గోద్రా రైలు దహనం కేసు దోషులకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. గోద్రా అల్లర్లను 'తీవ్రమైన ఘటన'గా ధర్మాసనం పేర్కొంది. 27 ఫిబ్రవరి 2002న గోద్రా రైలు దహనం ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. ప్రధాని నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయలోనే ఈ ఘటన జరిగింది. 59 మంది సజీవ దహనమయ్యారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా భావించిన సౌకత్ యూసుఫ్ ఇస్మాయిల్, బిలాల్ అబ్దుల్లా ఇస్మాయిల్, సిద్దికరే జీవిత ఖైదు విధించారు. తమకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వీరు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిని తీవ్రమైన ఘటనగా పేర్కొన్న సుప్రీంకోర్టు ఇది ఒక వ్యక్తి హత్యకు సంబంధించింది కాదని, ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జెబి పార్థీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ ముగ్గురు రైలు దహనం కేసులో కీలక పాత్ర పోషించారని తెలిపింది. దీని కారణంగా వారికి బెయిల్ ఇవ్వడం కుదరదంటూ వారు పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది.

బుర్జ్ ఖలీఫాపై రెపరెపలాడిన మువ్వన్నెల జెండా..

దుబాయ్: భారత్ 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనమైన దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫాపై భారత జెండాను ప్రదర్శించారు. అర్ధరాత్రి 12 గంటల ఒక్క నిమిషానికి బుర్జ్ ఖలీఫాపై ఎల్‌ఇడి లైట్లతో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. ఆ సమయంలో భారత జాతీయ గీతం కూడా వినిపించింది. ఆగస్టు 14న స్వాతంత్ర్య వేడుకలను జరుపుకుంటున్న పాకిస్థాన్‌కు అవమానం జరిగింది. తమ దేశ జెండాను బుర్జ్ ఖలీఫాపై చూసుకునేందుకు వచ్చిన పాకిస్థానీలు ఎగరవేయకపోవడంతో నిరాశగా వెనుతిరిగారు.



మఖాచకలాలో సోమవారం సాయంత్రం పెద్ద పేలుడు సంభవించడంతో దగ్ధమౌతున్న ఆటో రిపేర్ దుకాణం

రష్యాలో పేలుడు

- 35 మంది మృతి, పలువురికి గాయాలు

మాస్కో : రష్యాలోని దక్షిణ డాగెస్తాన్ రిపబ్లిక్ రాజధాని మఖాచకలాలో ఒక ఆటో రిపేర్ దుకాణంలో సోమవారం సాయంత్రం పెద్ద పేలుడు సంభవించింది. ఈ పేలుడులో ముగ్గురు పిల్లలతో సహా 35మంది మరణించారని, 115 మంది గాయపడ్డారని రష్యా అత్యవసర పరిస్థితుల మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. ఈ పేలుడు వల్ల పెద్ద ఎత్తున మంటలు లేచాయని, దాంతో సమీపంలోని ఇంధన స్టేషన్‌లో శక్తివంతమైన పేలుళ్లు జరిగాయని పేర్కొన్నారు. గాయపడిన వారిలో చాలామంది పిల్లలు వున్నారని, అందరికీ సమీపంలోని ఆస్పత్రుల్లో చికిత్స అందుతోందని ఆరోగ్య శాఖ తెలిపింది. గాయపడిన వారిలో 11మంది పరిస్థితి ఆందోళనకరంగా వుందని, వారిలో ఇద్దరు పిల్లలు వున్నారని పేర్కొంది. ఏమాత్రమూ సురక్షితం కాని తీరులో రిపేర్ దుకాణంలో సేవలందిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ప్రాతిపదికనే స్థానిక అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పేలుడు జరిగిన వెంటనే అక్కడ నెలకొన్న దృశ్యాల వీడియోను టెలిగ్రామ్ చానెల్ పోస్ట్ చేసింది. ఫ్యూయల్ స్టేషన్‌కు సమీపంలో పెద్ద ఎత్తున మంటలు లేస్తున్నట్లు ఆ వీడియోలో కనిపిస్తోంది. ఆ తర్వాత ఆ స్టేషన్‌కు కూడా మంటలు వ్యాపించాయి. స్టేషన్ నుండి సమీపంలోని భవనాలకు కూడా మంటలు వ్యాపించాయని వార్తలు అందాయి. దగ్గరుండి అక్కడ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు ఆ ప్రాంత గవర్నర్ సెర్గి మెలికొవ్ తెలిపారు. బాధితులందరికీ అవసరమైన వైద్య సాయం అందుతోందా? లేదా? అని చూసేందుకు ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఫస్ట్ డిప్యూటీ విక్టర్ ఫిసెంకో డాగెస్తాన్ వెళ్లారు. అవసరమైతే బాధితులను ప్రత్యేక విమానంలో మాస్కోకు తరలిస్తామని అత్యవసర పరిస్థితుల మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చింది.

పాత పాటే...

(మొదటి పేజీ తరువాయి)

పేదరికం నుంచి బయట పడేశామని ప్రధాని చెప్పారు. వారంతా మధ్య తరగతికి బలంగా మారారని సెలవిచ్చారు.

మహిళలు లక్షాధికారులుగా..

మహిళా స్వయం సహాయక బృందాల కృషిని మోడీ ప్రశంసించారు. నేడు మహిళా స్వయం సహాయక బృందాల్లో 10 కోట్ల మంది మహిళలు ఉన్నారని, మహిళల నేతృత్వంలో అభివృద్ధి జరిగితే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. పౌర విమానయాన రంగంలో మహిళా పైలట్లు ఉన్నారని, మహిళలు శాస్త్రవేత్తలు అవుతున్నారని చెప్పడం గర్వంగా ఉందన్నారు.. చంద్రయాన్ కార్యక్రమానికి మహిళా శాస్త్రవేత్తలు నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధికి ఉన్న ప్రాధాన్యాన్ని జీ20 దేశాలు గుర్తించాయన్నారు.

యువతకు మెరుగైన భవిత

దేశంలో యువతకు మెరుగైన భవితను కల్పిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో అవకాశాలకు కొరత లేదన్నారు. మన యువత ప్రపంచంలో మొదటి మూడు స్టార్టప్ ఇకోసిస్టమ్స్‌లో ఒకదానిగా దేశాన్ని తీసుకెళ్లారని తెలిపారు. మన దేశ సైనిక దళాలు నూతన జవసత్వాలతో, యుద్ధ సన్నద్ధతతో ఉండేలా నిరంతరం సంస్కరణలు జరుగుతున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాలను పొందుతున్న 10 కోట్ల మంది బూటకపు లబ్ధిదారులను తొలగించామన్నారు.. అక్రమాస్తుల జప్తు 20 రెట్లు పెరిగిందన్నారు. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞాన రంగంలో దేశ సామర్థ్యం వేగంగా పెరుగుతోందన్నారు. డీప్ సీ మిషన్, రైల్వేల ఆధునికీకరణ, వందే భారత్ రైలు, బుల్లెట్ రైలు... ఇలాంటివాటి కోసం మనం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాలకు ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. నానో యూరియా కోసం కృషి చేస్తున్నామని, ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి పెట్టామని చెప్పారు.

మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణకు కృషి

మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ప్రధాని చెప్పారు. గత కొన్ని వారాల్లో ఈశాన్య రాష్ట్రాల్లో, మరీ ముఖ్యంగా మణిపూర్‌లో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. దేశ ఆడబిడ్డల గౌరవ, మర్యాదలకు తీవ్ర భంగం కలిగిందని అన్నారు. యావద్భారతావని మణిపూర్ రాష్ట్రానికి, ప్రజలకు అండగా ఉందని తెలిపారు. ఈ ఏడాది చాలా రాష్ట్రాలు అనూహ్యమైన సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయని అన్నారు. ఈ సవాలును అధిగమించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పని చేస్తాయని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాని మోడీ కొన్ని పథకాలు ప్రకటించారు.

విశ్వకర్మ పథకం

వచ్చే నెల నుంచి రూ.13 వేల కోట్లతో విశ్వకర్మ పథకాన్ని ప్రారంభిస్తామని మోడీ తెలిపారు. క్షురక వృత్తి, బట్టలు ఉతకడం, బంగారు ఆభరణాలు తయారు చేయడం వంటి సంప్రదాయ నైపుణ్యాలుగలవారికి ఈ పథకం కింద లబ్ధి చేకూరుతుందని చెప్పారు.

చౌక ధరకు మందులు

జన ఔషధి కేంద్రాలను 10 వేల నుంచి 25 వేలకు పెంచాలని తన ప్రభుత్వం ప్రణాళిక రచించిందని చెప్పారు. జనరిక్ మందులు అందరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. మధుమేహ రోగగ్రస్థులు నెలకు రూ.3,000 వరకు ఖర్చు చేయవలసి వస్తోందని, రూ.100 విలువైన మందులు జన ఔషధి కేంద్రాల్లో రూ.10 నుంచి రూ.15కే అందుబాటులో ఉంటాయని చెప్పారు.

సొంతింటి కల

పట్టణాలు, నగరాల్లో తమకు ఓ సొంత ఇల్లు ఉండాలని కలలు కంటున్నవారి కోసం తన ప్రభుత్వం ఓ పథకాన్ని ప్రవేశపెడుతోందన్నారు. నగరాల్లో నివసిస్తూ, సొంత ఇల్లు లేని మధ్య తరగతి ప్రజలకు బ్యాంకు రుణాల్లో ఉపశమనం కల్పించేందుకు ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

ధరాభారం పడకుండా..

ద్రవ్యోల్బణం పెరుగుతున్నందు వల్ల ప్రజలపై ధరల భారం అతి తక్కువగా ఉండేలా చూడటం కోసం మరిన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రణలో ఉంచడంలో తన ప్రభుత్వం కొంత వరకు విజయం సాధించిందని చెప్పారు.

తొలుత ప్రధాని మోడీకి ఎర్రకోట వద్ద రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సహాయ మంత్రి అజయ్ భట్, కార్యదర్శి గిరిధర్ అరమానే తదితరులు స్వాగతం పలికారు. ప్రధాని జాతీయ జెండాను పూల వర్షం కురిపించిన భారత వైమానిక దళానికి చెందిన మార్క్-III ధ్రువ్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు ఆవిష్కరించాయి. ఎర్రకోట వద్ద పుష్పాలంకరణలో విశేషాకర్షణగా జి-20 లోగో నిలిచాయి. ఎర్రకోటకు చేరుకునే ముందు రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీ సమాధి వద్ద ప్రధాని మోడీ నివాళులర్పించారు. ఎర్రకోటలో వేడుకలు తిలకించేందుకు దేశంలోని వివిధ రంగాల నుంచి సుమారు 1,800 మంది ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. 'జన భాగస్వామ్యం' పేరిట వీరికి ఆహ్వానం పంపారు. ఉజ్వల గ్రామాల నుంచి 400 మంది సర్పంచులు సహా 660 మందిని పైగా హాజరయ్యారు. రైతు ఉత్పత్తిదారు సంస్థల నుంచి 250 మంది, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం, ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి పథకం కింద 50 మంది, కొత్త పార్లమెంట్ భవనం, సెంట్రల్ విస్టా ప్రాజెక్టు నిర్మాణంలో పాల్గొన్న 50 మంది కార్మికులు, సరిహద్దు రోడ్ల నిర్మాణం, అమృత సరోవరాల తవ్వకం, ఇంటింటికీ నీరు పథకంలో పాల్గొన్న కార్మికులు, 50 మంది ఖాదీ కార్మికులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, నర్సులు, మత్స్యకారుల నుంచి 50 మంది చొప్పున ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు.

ఖర్గే కుర్చీ ఖాళీగా దర్శనం

స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొనలేదు. ఈ సభలో ఆయన కోసం కేటాయించిన కుర్చీ ఖాళీగా దర్శనమిచ్చింది. అయితే ఆయన ఓ రికార్డెడ్ మెసేజ్‌ని పంపించారు. గత కాలపు ప్రధాన మంత్రులు పోషించిన పాత్రను ఆ మెసేజ్‌లో వివరిస్తూ, ప్రస్తుత ప్రధాని మోడీ ప్రతిపక్షాలను వెంటాడుతున్నారని దుయ్యబట్టారు. ఖర్గే కాంగ్రెస్ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం కోసం కొత్త కొత్త సాధనాలను మోడీ వాడుతున్నారని ఖర్గే విమర్శించారు. సిబిఐ, ఈడి, ఆదాయపు పన్ను శాఖ దాడులు మాత్రమే కాకుండా ఎన్నికల కమిషన్‌ను కూడా బలహీనపరిచారన్నారు. ప్రతిపక్ష ఎంపిలపై దౌర్జన్యం చేస్తున్నారని, సస్పెండ్ చేస్తున్నారని, మైకులను పనిచేయనివ్వడం లేదని, ప్రసంగాలను రికార్డుల నుంచి తొలగిస్తున్నారని దుయ్యబట్టారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్, అంతరిక్ష, అణు పరిశోధన సంస్థలు వంటివాటిని గతంలో ఏర్పాటు చేసినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం ఆ విషయాన్ని మరుగుపరుస్తోందని విమర్శించారు.



మీకోసం

వర్షాకాలంలో మసాలా, చక్కెర, పప్పుల డబ్బాలో సిలికా జెల్ ప్యాక్‌లను వేస్తే అవి తేమను నియంత్రిస్తాయి. వస్తువులు త్వరగా పాడవ్వవు.

జీవన సౌరభం

లక్ష్యం ఏర్పర్చుకోవడానికి సందర్భం అంటూ ఏమీ అవసరం లేదు. సంకల్పం ఉంటే చాలు.

బంగారు చిలుక



చిలుకల వనంలో అనేక రామచిలుకలు నివాసం ఉంటున్నాయి.. అన్నింటికంటే బంగారు రంగులో ప్రత్యేకంగా కనిపించే రామ చిలుక చాలా అందంగా ఉండేది. తన అందాన్ని చూసుకుని అది ఎప్పుడూ గర్వపడేది. తానే అందరికంటే గొప్పదానినని భావించేది. ఒకరోజు ఆ దేశపు రాజు విహారానికి ఆ వనానికి వచ్చాడు. వనంలోని ఫల పుష్పాలను చూసి ఆనందిస్తున్న రాజుకు బంగారు చిలుక కనిపించింది. దానిని చూసి ముగ్ధుడైన రాజు ఆ చిలుకను పట్టి తెమ్మని భటులకు ఆజ్ఞాపించి వెళ్ళాడు. భటులు ఎంతో ప్రయాసపడి ఎట్టకేలకు ఆ బంగారు చిలుకను పట్టి రాజ మందిరానికి తీసుకెళ్ళారు.

రాజు దాన్ని పంజరంలో పెట్టి ఎంతో సంతోషించాడు. దేశం నలుమూలల నుంచి మేలైన గింజలు తెప్పించి ఆహారంగా పెట్టాడు. అయితే ఎంత రాజభోగాలు అనుభవిస్తున్నా చిలుక మాత్రం దిగులుగా ఉండేది. ఒక్కసారిగా దానికి వనంలోని తన తోటి చిలుకలు గుర్తుకొచ్చాయి. అవి దాన్ని ఎంత ప్రేమగా చూసుకునేవో జ్ఞాపకం చేసుకుని ఏడ్చింది. అప్పట్లో వాటి విలువ తెలియక వాటిని ఎంత చులకనగా చూశానని తలుచుకుని బాధపడింది.

ఒక రోజు చిలుకలవనంలో చిలకలన్నీ జామచెట్టుపై సమావేశమై బంగారు చిలుక గురించి చర్చించుకున్నాయి. 'బంగారు చిలుక మనలో ఒకటి. దానిని రక్షించుకోవడం మన బాధ్యత. దాన్ని మనం కాపాడుకుందాం' అని చిలుకలన్నీ తీర్మానించుకున్నాయి. మరుసటిరోజు తెల్లవారుజామున గుంపుగా వెళ్ళి రాజ మందిరంలో బంగారు చిలుక ఉన్న చోటుకు చేరుకున్నాయి. ఒక్క ఉదుటున బంగారు చిలుక ఉన్న పంజరాన్ని నోట కరుచుకుని ఎగిరిపోయాయి. చిలుకల అభిమానానికి బంగారు చిలుకకు కళ్ళు చెమర్చాయి. తనను క్షమించమని వాటిని కోరింది. చిలుకలన్నీ కలిసి పంజరం తలుపును తెరిచాయి. బంగారు చిలుక స్వేచ్ఛగా ఆకాశంలోకి ఎగిరిపోయింది.

- గేరపాటి భానువర్ధన్,
81065 86997.

సరైన ఒత్తు రాయండి

పిల్లలూ, ఇక్కడ ఉన్న అక్షరాలకు ఎదురుగా కింద ఇచ్చిన ఒత్తుల్లో ఏవి సరిపోతాయో మీరు రాయండి.

ఞ ఖ ఘ జ ట ఝ ం చ

ఖ-	జ-
గ-	ఝ-
ఘ-	ఞ-
చ-	ట-
ఛ-	ఠ-

నేను గీసిన బొమ్మ



- ఆర్.దేష్ణశ్రీ,
5వ తరగతి
ప్రాథమిక పాఠశాల,
దిగువ సాంబయ్య పాలెం,
తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



బొమ్మలతో విద్యా బోధన

పుస్తకంలో ఉన్నదానిని ఉన్నది ఉన్నట్టుగా బోధించటం ఒక పద్ధతి. ఆ పాఠాల్లో ఉన్న పాత్రలను తరగతి గదిలో ఆవిష్కరించి, అందులో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా బోధించటం మరో పద్ధతి. వినటం కన్నా చేయడం ద్వారా మరింత ఎక్కువగా గుర్తు పెట్టుకోవొచ్చు అన్నది ఈ రెండో తరహా బోధనకు ప్రేరణ. అలాంటి పద్ధతితో పిల్లలకు విలక్షణ శైలిలో విద్యాబోధన చేస్తున్నారు మానుకొండ రాజేంద్రబాబు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం రాయలం-2 ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు.







రాజేంద్రబాబు చెప్పే ప్రతి పాఠం బొమ్మల రూపంలో ప్రత్యక్షమవుతుంది. బట్టీ విధానంలో విద్యార్థుల మనోఫలకంలో చదివింది పెద్దగా గుర్తుండదనీ, అదే పాటలు, నృత్యాలు, టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ సహకారంతో అభినయం, నాటికీకరణ, వర్కింగ్ మోడళ్ల ద్వారా బోధన చేస్తే హృద్యంగా ఆకట్టుకుంటుందని ఆయన ఆచరణలో నిరూపించారు. పనికిరాని వస్తువులతో చక్కటి బోధనోపకరణాలు తయారు చేయించటంతో పాటుగా వాటికి సృజనాత్మకత జోడిస్తే... కొత్త ఆలోచనలు, సరికొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని ఆయన రుజువు చేశారు. ప్రపంచం, సమాజం, కుటుంబం, ప్రకృతి, జీవనం, జీవన వైవిధ్యం ... ఇలా ఏ అంశమైన వాటి గురించి తెలియజేసే సజీవ చిత్రం (బొమ్మలు చార్టులు, ప్లకార్డులు) ద్వారా ఆచరణాత్మకంగా పాఠాలు చెబుతున్నారు. వర్ణమాల మొదలు, ఆంగ్ల వ్యాకరణం, గణిత ప్రక్రియలు, మానవ శరీర భాగాలు, పర్యావరణం, రాజధానుల గుర్తింపు వంటి అనేక అంశాల్లో ఆయన బోధనోపకరణాలు రూపొందించారు. వాటి ద్వారా విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి సాధించేలా కృషిచేస్తున్నారు.

తండ్రి రాజారావు స్ఫూర్తితో...

రాజేంద్రబాబు ఉంగుటూరులో మానుకొండ రాజారావు, రాహేలమ్మ దంపతులకు 1963 ఆగస్టు 15న జన్మించారు. ఆయన తండ్రి హైస్కూలులో సోషల్, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు. బహుముఖ ప్రజ్ఞాశాలి. తండ్రి స్ఫూర్తితోనే రాజేంద్రబాబు చిత్రలేఖనం నేర్చుకున్నారు. అట్టలతో, ధర్మకోల్‌తో నమూనాలు తయారు చేయడం ప్రారంభించారు. హైస్కూలు స్థాయిలో చిత్రలేఖన పోటీల్లో పలు బహుమతులు



సాధించారు. కాలేజీ చదివే రోజుల్లో లెక్చరర్ ఎంఎస్ఎన్ మూర్తి ప్రోత్సాహంతో జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీ అవార్డు పొందారు. ఎంఎ, ఎంఇడి చదివిన అయన 1986లో సోషల్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. తను పనిచేసిన అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రలేఖనం నేర్పడంతో పాటు వినూత్నంగా పాఠాలు బోధించారు. ప్రస్తుతం భీమవరం మండలం చిన అమిరంలో స్థిరపడ్డారు. రాయలం-2 ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు.

పాఠ్య పుస్తకాల తయారీలో...

విద్యాబోధనలో నూతన పద్ధతులు అవలంబించటం ద్వారా రాజేంద్రప్రసాద్‌కు రాష్ట్రస్థాయిలో ఎస్‌సిఆర్‌టి, జాతీయస్థాయిలో ఎన్‌సిఇఆర్‌టి ద్వారా గుర్తింపు లభించింది. పప్పెట్రీ కళను ఉపయోగించుకుని పిల్లలకు విద్యాబోధన చేయటం మరింత గుర్తింపు తెచ్చింది. మాడ్యూల్స్ తయారీ, కవర్ పేజీ డిజైన్; బోధనోపకరణాలు ఉపాధ్యాయ కరదీపికలు, చేసి చూద్దాం, సృజన పుస్తకాల తయారీలో ఆయన సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించుకున్నాయి. విద్యా సంబంధిత వెబ్‌సైట్లు, ఇ.ఎడ్యుకేషన్, ఇ.బోధన వీడియోల తయారీలోనూ ఆయన పాలు పంచుకున్నారు. ఇలాంటి కృషికి గుర్తింపుగా ఇటీవల ఆయన కర్ణాటక ప్రభుత్వ పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పప్పెట్రీ అకాడమీలో శిక్షణ పొందారు. 8వ తరగతి పాఠ్య పుస్తకాలపై తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సైన్స్, సోషల్, ఉర్దూ పాఠ్య పుస్తకాల్లో ఆయన గీచిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 2021లో ఉర్దూ పాఠ్యపుస్తకాలకు చిత్రకారునిగా పనిచేశారు. రిసోర్స్ పర్సన్‌గా శ్రీకాకుళం, విజయనగరం, కడప, కర్నూలు జిల్లాల ఉపాధ్యాయులకు ఆన్లైన్ శిక్షణ ఇచ్చారు.

- గొట్టేటి శ్రీనివాసులు,
93971 39966
కాళ్ళమండలం

బొమ్మల వల్ల పిల్లల్లో ఆసక్తి



విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తిని పెంచడానికి విద్యార్థుల చేత చిత్రలేఖనం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు చేయిస్తున్నాం. సీతాకోకచిలుక ఆకారంలో లైబ్రరీ బుక్స్‌ని ఏర్పాటు చేశాం. ఆర్ట్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన నిర్వహించాం. టిఎల్ఎం కార్నర్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఆకర్షణీయమైన బోధనోపకరణాలు ఏర్పాటు చేశాం. క్లిప్, క్లాప్స్ మాడ్యూల్స్ రచయితల్లో నేనూ ఒకరిగా ఉన్నారు. సిసిఆర్‌టి న్యూఢిల్లీ వారు నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొని జాతీయస్థాయిలో టిఎల్ఎం తయారీలో రెండుసార్లు ఉదయపూర్ (రాజస్థాన్) లోను, న్యూఢిల్లీలోనూ జాతీయస్థాయి ప్రథమ స్థానం పొందాను. ప్రస్తుతం రాష్ట్ర కీ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నా.

- మానుకొండ రాజేంద్రబాబు

కులాలంటే నాకు అసహ్యం : నటుడు మోహన్‌బాబు



'అప్పట్లో కులాలు ఉన్నా సరే అందరూ ఆప్యాయంగా పిలుచుకునేవారు. అక్క, అత్త, మామ, అల్లుడు పిలుపులతో కలిసిమెలిసి ఉండేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. కులం పేరుతో దూషిస్తున్నారు. అసలు కులాలను ఎవరు కనిపెట్టారు? చిన్నతనంలో నాతోటి వాడిని అంటరానివాడంటే చెప్పుతో కొడతానన్నాను. ఇప్పుడు కొందరికి కులం పిచ్చి మరీ ఎక్కువైంది. ఇది నాశనానికి దారి తీస్తుంది. అందుకే నాకు కులాలంటే అసహ్యం' అని మోహన్‌బాబు చెప్పుకొచ్చారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని మోహన్‌బాబు తన యూనివర్సిటీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సమీప గ్రామస్తులతో 100 మొక్కలు నాటి తన వంతు బాధ్యత నెరవేర్చారు. తన ఎదుగుదలకు కారణమైన తల్లిదండ్రులు, జన్మభూమిని, ఆప్తులు, ఆత్మీయులైన తన గ్రామస్తులని ఎప్పుడూ గుర్తు చేసుకుంటూనే ఉంటానని ఈ సందర్భంగా మోహన్‌బాబు అన్నారు.



హిందీలో 25న 'భోళా శంకర్' విడుదల

చిరంజీవి హీరోగా మెహర్ రమేశ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భోళా శంకర్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. ఇప్పుడీ చిత్రం హిందీలోనూ విడుదలకు సిద్ధమైంది. తెలుగులో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ చిత్రాన్ని హిందీలో ఆర్కేడీ స్టూడియోస్ ఈనెల 25న విడుదల చేయనుంది. ఈ విషయాన్ని తెలుపుతూ మేకర్స్ హిందీ వెర్షన్ టీజర్‌ను విడుదల చేశారు. హిందీలో చిరంజీవికి జాకీ ష్రాఫ్ డబ్బింగ్ చెప్పారు. చిరంజీవి సరసన తమన్నా నటించిన ఈ చిత్రంలో కీర్తి సురేష్, సుశాంత్, తరుణ్ అరోడా, మురళీ శర్మ, షాయాజీ షిండే తదితరులు కీలక పాత్రలు పోషించారు.

స్వామికి రీమేక్‌గా 'భగవంత్ కేసరి'..!



బాలకృష్ణ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'భగవంత్ కేసరి'లో కాజల్ కథానాయిక. శ్రీలీల కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ మూవీ 'స్వామి' చిత్రానికి రీమేక్ అంటూ ఓ వార్త సామాజిక మాధ్యమాల వేదికగా చక్కర్లు కొడుతోంది. రీమేక్ కాదంటూ దీనిపై చిత్ర బృందం స్పష్టతనిచ్చింది. హరికృష్ణ, మీనా, ఉమ కీలక పాత్రల్లో వీఆర్ ప్రతాప్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'స్వామి'. పోసాని కృష్ణమురళి రచయితగా పని చేసిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మెప్పించ లేకపోయింది. తన చెల్లెళ్ల మరణానికి కారణమైన వ్యక్తులపై స్వామి, అతని భార్య ఎలా పగ తీర్చుకున్నారన్నదే ఈ చిత్ర కథ. ఇప్పుడు అదే కథకు మార్పులు చేసి, 'భగవంత్ కేసరి'గా రూపొందిస్తున్నారనే వార్తలు సామాజిక మాధ్యమాల వేదికగా చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే.

దుల్కర్, సోనమ్ కపూర్‌లకు రానా క్షమాపణలు



తన వ్యాఖ్యలను కొందరు నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారని రానా అన్నారు. దుల్కర్, సోనమ్ కపూర్‌లకు ఆయన క్షమాపణలు చెప్పారు. ఇటీవల జరిగిన 'కింగ్ ఆఫ్ కోథా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో రానా మాటలు వివాదాస్పదమయ్యాయి. దీంతో నేడు తన సోషల్ మీడియా వేదికగా దుల్కర్, సోనమ్ కపూర్‌లకు ఆయన క్షమాపణలు చెప్పారు. వాళ్లంటే తనకు ఎంతో గౌరవమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ ట్వీట్ వైరలవుతోంది. దుల్కర్ సల్మాన్ హీరోగా అభిలాష్ జోషిలీ తెరకెక్కించిన చిత్రం 'కింగ్ ఆఫ్ కోథా'. ఇటీవల దీని ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. దానికి రానా, నాని ముఖ్య అతిథులుగా వెళ్లారు. ఆ ఈవెంట్‌లో రానా మాట్లాడుతూ. "దుల్కర్‌కు చాలా సహనం. నేను ఓసారి తన సినిమా షూటింగ్‌కు వెళ్లాను. అక్కడ ఓ స్టార్ హీరోయిన్ చాలా సమయాన్ని వృథా చేసింది. ఆమె కోసం దుల్కర్ ఎండలో వేచిచూస్తుంటే.. ఆమె మాత్రం తన భర్తతో షాపింగ్ గురించి చాలాసేపు మాట్లాడుతూనే ఉంది. అది చూసి నాకు కోపం వచ్చింది. నా చేతిలో ఉన్న వాటర్ బాటిల్ విసిరేశాను. కానీ, దుల్కర్ మాత్రం చాలా ప్రశాంతంగా షూటింగ్ పూర్తి చేశాడు" అని అన్నారు. దీంతో నెటిజన్లంతా ఆ హీరోయిన్ సోనమ్ కపూర్ అంటూ ఆమెను ట్రోల్ చేయడం మొదలు పెట్టారు. ఈ మొత్తం వ్యవహారంపై రానా తన ట్విటర్‌లో వివరణ ఇస్తూ వాళ్లకు క్షమాపణలు చెప్పారు.

అక్షయ్ కుమార్‌కు భారతీయ పౌరసత్వం



బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్‌కు ఎట్టకేలకు భారతీయ పౌరసత్వం లభించింది. ఈ విషయాన్ని ఆయన ట్విటర్ వేదికగా వెల్లడించారు. 'నా హృదయం.. పౌరసత్వం.. రెండూ భారతీయమే.. స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు' అని ఆయన పేర్కొన్నారు. తనకు కెనడా పౌరసత్వం ఉందన్న విషయాన్ని అక్షయ్ గతంలో వెల్లడించిన విషయం తెలిసిందే. తాను కెనడా పౌరసత్వం తీసుకోవడానికి గల కారణాన్ని అక్షయ్ కుమార్ గతంలో ఓ ఇంటర్వ్యూలో వివరించారు. '1990లో గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నా. వరుసగా 15 సినిమాలు పరాజయం పాలయ్యాయి. కెనడాలో ఉన్న స్నేహితుడి సలహా మేరకు అక్కడికి వెళ్లి పనిచేయాలని నిర్ణయించుకున్నా. అందుకోసమే పాస్‌పోర్ట్‌కు అప్లయ్ చేశా. అప్పుడే కెనడా పాస్‌పోర్ట్ వచ్చింది. అంతలోనే అప్పటికే నటించిన రెండు సినిమాలు భారత్‌లో ఘన విజయం సాధించడంతో అక్కడికి వెళ్లాల్సిన అవసరం రాలేదు. ఈ క్రమంలోనే పాస్‌పోర్ట్ విషయం మరిచిపోయా. అందుకే భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నా' అని అక్షయ్ వివరించారు.

చరిత్ర సృష్టించిన స్పెయిన్

ఫిఫా మహిళల ప్రపంచకప్ ఫైనల్‌కు తొలిసారి



తొలి గోల్ కొట్టిన సల్మా బూట్‌ను ముద్దాడుతున్న స్పెయిన్ ప్లేయర్; విజయానంతరం సంబరాలు



ఒల్గా కార్మోనా

సిడ్నీ : ఫిఫా మహిళల ప్రపంచ కప్‌లో స్పెయిన్ జట్టు నయా చరిత్రను నెలకొల్పింది. ఈడెన్ పార్క్‌లో ఉత్కంఠభరితంగా సాగిన సెమీస్‌లో స్పెయిన్ జట్టు 2-1గోల్స్ తేడాతో స్వీడన్‌ను చిత్తుచేసింది. సల్మా పారల్లులో 81 నిమిషంలో గోల్ చేయడంతో స్పెయిన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత స్వీడన్ ప్లేయర్ రెబెక్కా బ్లొంక్విస్ట్ 89వ నిమిషంలో గోల్ కొట్టి స్కోర్ సమం చేసింది. కొద్ది నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందని స్పెయిన్‌కు చెందిన ఒల్గా కార్మోనా గోల్ కొట్టి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. మ్యాచ్ ప్రారంభమైన 80 నిమిషాలవరకు ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. ఈ టోర్నీ ఆరంభం నుంచి అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్న స్పెయిన్ మహిళల జట్టు తొలిసారి ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్లో అడుగు పెట్టింది. చివర్లో ఒల్గా కార్మోనా విన్నింగ్ గోల్ కొట్టడంతో స్పెయిన్ శిబిరం సంబరాల్లో మునిగిపోగా.. స్వీడన్ ప్లేయర్స్ కన్నీటి పర్యంతమయ్యారు. బుధవారం ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ జరగనుండగా.. ఫైనల్ మ్యాచ్ 20న జరగనుంది.

టెస్ట్ క్రికెట్‌కు హసరంగ గుడ్‌బై



కొలంబో: ఇంగ్లండ్ స్పిన్నర్ వానిందు హసరంగా టెస్ట్ క్రికెట్‌కు గుడ్ చెప్పాడు. వైట్ బాల్ క్రికెట్‌లో మాత్రమే కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు అందుకు వర్క్‌లోడ్ తగ్గించుకొనేందుకు టెస్ట్ క్రికెట్‌కు దూరంగా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. టి20ల్లో ప్రపంచ మూడో ర్యాంకర్ అయిన హసరంగ.. శ్రీలంక క్రికెట్ బోర్డు(ఎస్ఎల్‌సి) చైర్మన్‌కు మంగళవారం రిటైర్మెంట్ లేఖను పంపించాడు. అతని రిటైర్‌మెంటును అంగీకరించినట్లు లంక క్రికెట్ బోర్డు వెల్లడించింది. ఈ విషయంపై ఎస్ఎల్‌సీ సీఈవో యాష్లే డి సిల్వ ఓ ప్రకటనలో.. 'మేం హసరంగ రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని స్వీకరిస్తున్నాం. భవిష్యత్తులో టీం వైట్‌బాల్ ప్రోగ్రాంలో కీలకమైన ఆటగాడిగా ఉంటాడని భావిస్తున్నాం' అని తెలిపారు. 2020లో దక్షిణాఫ్రికాపై టెస్టుల్లో అరంగేట్రం చేసిన హసరంగా.. నాలుగు టెస్టులే ఆడాడు. 2021లో బంగ్లాదేశ్‌తో తన చివరి టెస్టు మ్యాచ్ ఆడాడు.

వన్డే ప్రపంచకప్ టికెట్లు రిజిస్ట్రేషన్ ప్రారంభం

ముంబయి: ఐసిసి వన్డే ప్రపంచకప్ టికెట్ల రిజిస్ట్రేషన్ మంగళవారం నుంచి ప్రారంభమైంది. టికెట్లు కావాలనుకునే వాళ్లువెబ్ సైటులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బిసిసిఐ ఓ ప్రకటనలో వెల్లడించింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగస్టు 15మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ప్రారంభమైందని.. టికెట్లు కొనుగోలు చేయాలనుకునే వాళ్లు www.cricket-worldcup.com/register వెబ్‌సైటులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొంది. ఇలా రిజిస్టర్ చేసుకున్న వారికి మాత్రమే ఈ నెల 25 నుంచి టికెట్లు కొనుగోలు చేసే వీలుంటుంది. టీమిండియా ఆడే మ్యాచులకు సంబంధించి ఈ నెల 25, 30, 31తోపాటు సెప్టెంబరు 1, 2, 3, తేదీల్లో టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఐర్లాండ్‌కు బయల్దేరిన బుమ్రా

రింకూ, సుందర్, ప్రసిధ్ కూడా..



ముంబయి: స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా సారథ్యంలోని యువ భారత బృందం మంగళవారం ఐర్లాండ్‌కు బయలు దేరింది. టీమిండియా క్రికెటర్లు బయల్దేరిన ఫొటోలను బిసిసిఐ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. బుమ్రాతో పాటు రుతురాజ్ గైక్వాడ్, పేసర్ ప్రసిధ్ కృష్ణ, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్ ఉన్నారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి క్రికెట్‌కు దూరంగా ఉన్న బుమ్రా ఈ సిరీస్‌తో పునరాగమనం చేస్తున్నాడు. భారత్, ఐర్లాండ్ మధ్య మూడు మ్యాచ్‌ల పొట్టి సిరీస్ ఆగస్టు 18న మొదలుకానుంది. ఆసియా కప్, వన్డే వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలకు ముందు జరుగుతున్న ఈ సిరీస్ యువ ఆటగాళ్లకు ఎంతో కీలకం. ఇందులో రాణించినవాళ్లకు ఆసియా కప్ ప్రిపరేషన్ క్యాంపులో చోటు దక్కే అవకాశం ఉంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68